# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :216 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 31-10-2024 | పేజీలు:4 వెల: 2.00


## తిరుపతిలో టెన్షన్.. ఆ హొటళ్లను పేల్చేస్తామంటూ అర్ధరాత్రి మెయిల్స్

తిరుపతి: ఆధ్యాత్మిక నగరి తిరుపతిలో వరుస బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. స్థానికులతోపాటు శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు ఆందోళనకు గుర్తిచేస్తున్నాయి. నగరంలోని హొటళ్లకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. గ్యాస్, వాటర్ పైపులైన్లు, మురుగునీటి పైపుల్లో పేలుడు పదార్థాలు ఉంచామంటూ ఎనిమిది హొటళ్లకు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు తాజ్, బ్లిస్, మినర్వా, చక్రి, పాయ్ వైస్రాయ్, రీనెస్ట్, గోల్డెన్ దులీప్ హొటళ్లలో పోలీసులు.. డాగ్, బాంబు స్క్వాడ్లతో తనిఖీలు చేశారు. అయితే ఎక్కడా పేలుడు పదార్థాలు లభించకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఐఎస్ఐ పేరుతో మంగళవారం రాత్రి 9.30 గంటలకు ప్రారంభమైన ఈ మెయిల్స్.. అర్ధరాత్రి వరకు కొనసాగాయి.కాగా, తమిళనాడులో ఐఎస్ఐ ఉగ్రవాది జాఫర్ సాదిక్?కు జైలు శిక్ష పడటంతో ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరిట ఈ బెదిరింపులు వస్తున్నాయి. తమిళనాడుతో పాటు తిరుపతిలోని హొటళ్లకు బాంబు మెయిల్స్ రావటం సమస్యగా మారింది.

## కేటీఆర్ నోరు మెదపరేం.. ఆ మహిళలకు న్యాయం జరిగేనా?




హైదరాబాద్, బీఆర్ఎస్ పెద్దలు కొన్ని రాజనీతి సూత్రాలు చెబుతారు. తాము అన్ని వర్గాల ప్రజలను గౌరవిస్తున్నామని, ముఖ్యంగా మహిళలంటే తమకు ఎనలేని అభిమానమని సందర్భాన్ని బట్టి చెప్పారు.. చెబుతున్నారు కూడా. మా పార్టీ మాదిరిగా వారికి అంత గుర్తింపు ఎవరు ఇవ్వరని ఓపెన్‌గా చెబుతారు. కానీ లోగుట్టు మాత్రం వేరేలా ఉంది. అసలు విషయం బయటకు వచ్చాక నేతలు సైలెంట్ అయిపోయారు. అది మాకు తెలీదంటూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.అధికారంలో ఉన్నప్పుడు కారు పార్టీలో ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. పవర్ పోయిన తర్వాత ఇప్పుడిప్పుడే అసలు విషయాలు బయటకు వస్తున్నాయి. మహిళల అంశంపై అప్పుడప్పుడు నోరు జారిన సందర్భాలున్నాయి.రెండు నెలల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ బస్సుల స్కీమ్‌పై కేటీఆర్ టంగ్ స్లిప్ అయ్యారు. మహిళలు ఆర్టీసీ బస్సు ఎక్కి బ్రేక్ డ్యాన్సులు, రికార్డింగ్ డ్యాన్సులు చేస్తున్నారంటూ చేసిన కామెంట్స్ తెలంగాణలో తీవ్ర దుమారం రేపింది. ఆ తర్వాత చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేశారాయన.మొన్నటి అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేను అధికార పార్టీ సభ్యులు ఏదో అన్నట్లు ఇంట బయటా తెగ రచ్చ చేశారు ఆ పార్టీ నేతలు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. అదంతా డ్రామా అని చివరకు తేలిపోయింది. ఆ సమయంలో మహిళలపై ఆ పార్టీ నేతలు నీతి సూత్రాలు వల్లించారు కూడా.లేటెస్ట్‌గా ఆ పార్టీలో లుకలుకలు బయటపడ్డాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మహిళా కార్యకర్త కారు పార్టీ నేతపై సంచలన ఆరోపణలు చేశారు. ఆ పార్టీలో కొందరు ఉన్నారని, వాడికి తప్ప ఎవరికీ సపోర్టు చేసినా నరకం చూపిస్తాడంటూ ఆ మహిళ చేసిన ట్వీట్ ఆ పార్టీలో పెద్ద దుమారం రేగింది.వాడి టార్చర్ తట్టుకోలేక పార్టీలో కొనసాగడం కష్టంగా ఉందని, అందుకే గుడ్ బై చెబుతున్నట్లు వెల్లడించింది. ఆ పార్టీ ఆమెకున్న రెండున్నర దశాబ్దాల బంధాన్ని తెంచేసుకుంది. జరుగుతున్న పరిణామాలను గమనించిన కొందరు మహిళా నేతలు కారు ఎక్కాలంటే భయపడిపోతున్నారు.ఉద్యమం నుంచి ఉన్న మహిళలకు అలాంటి పరిస్థితి ఉంటే కొత్తగా వెళ్తేవారి పరిస్థితి ఏంటంటూ చర్చించుకోవడం మొదలైపోయింది. ఇంకో విషయం ఏంటంటే.. ఆ పార్టీలో మహిళలకు కేటాయించిన పదవులు అలాగే ఉండిపోయాయట. వాటిని తీసుకునేందుకు ఎవరూ ముందుకు రావడం లేదంటూ ఆ పార్టీ శ్రేణులు గుసగుసలు పెట్టేసుకున్నాయి.దశాబ్దాల తరబడి ఇండియాలో చాలా పార్టీలు ఉన్నాయని, వాటిలో ఏనాడూ ఇలాంటి పరిస్థితులు లేదన్నది గులాబీ శ్రేణుల మాట. ఈ లెక్కన రేపటి రోజున ఆ పార్టీ ఉన్న కొంతమంది మహిళా కార్యకర్తలు, నేతలు సైతం దూరం కావచ్చనే చర్చ పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా సాగుతోంది. మరి గుసగుసలకు గులాబీ హైకమాండ్ చెక్ పెడుతుందా? లేదా? అన్నది చూడాలి.

## హైదరాబాద్ ఫార్ములా ఈ-రేస్ స్కామ్.. రంగంలోకి ఏసీబీ!

హైదరాబాద్,బీఆర్ఎస్ నేతలు కష్టాలు వెంటాడుతున్నాయి. గడిచిన పదేళ్లలో చేసిన అవకతవకలపై రేవంత్ సర్కార్ దృష్టి సారించింది. లేటెస్ట్‌గా హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ స్కామ్ ఒకటి వెలుగులోకి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా 55 కోట్ల రూపాయలను విదేశీ సంస్థకు ముట్టజెప్పారంటూ మున్సిపల్ అధికారులు ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో ఈ యవ్వారం వెలుగులోకి వచ్చింది. దీంతో గత పాలకుల చుట్టూ ఉచ్చు బిగుసుకున్నట్లయ్యింది.హైదరాబాద్‌లో ఫార్ములా ఈ-రేస్ నిర్వహణపై గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో గొప్పలు చెప్పుకుంది. ఆ తరహా రేస్ దేశంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ఉందని, అందులో హైదరాబాద్ ఒకటని ఢంకా బజాయించింది.ఈ రేసు వెనుక అసలు వాస్తవాలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి. లేటెస్ట్‌గా ఫార్ములా ఈ-రేస్ నిర్వహణ కోసం నిబంధనలకు విరుద్ధంగా 55 కోట్ల రూపాయలు విదేశీ సంస్థకు చెల్లించినట్లు మున్సిపల్ అధికారులు తేల్చారు. దీనిపై విచారణ జరపాలంటూ అధికారులు ఏసీబీకి లెటర్ రాయడంతో బీఆర్ఎస్ నేతలకు టెన్షన్ మొదలైంది.గతేడాది హైదరాబా ద్ హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో ఫార్ములా ఈ-రేస్ జరిగింది. ఈ రేస్ కోసం దాదాపు మూడు కిలోమీటర్ల మేరా ప్రత్యేకంగా ట్రాక్ ఏర్పాటు చేశారు. తొలి రేస్ సక్సెస్ కావడంతో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించేందుకు ఫార్ములా ఈ-రేస్ నిర్వాహకులతో పట్టణాభివృద్ధి సంస్థ డీల్ కుదుర్చుకుంది.ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా 55 కోట్ల రూపాయలను ఆ సంస్థకు చెల్లించింది. ఈ వ్యవహారమంతా బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగింది. గత డిసెంబర్‌లో తెలంగాణలో ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఒప్పందంలోని అంశాలు పాటించకపోవడం వల్ల హైదరాబాద్‌లో నిర్వహించాల్సిన ఫార్ములా ఈ- రేస్ నుంచి తప్పుకుంటున్నామని గత డిసెంబర్‌లో




నిర్వాహకులు ప్రకటించారు. దీంతో ఈ ఏడాది జరగాల్సిన రేసు ఆగిపోయింది.పద్దతి ప్రకారం.. హెచ్ఎండీఏ బోర్డు సభ్యులతోపాటు ఆర్థిక శాఖ అనుమతి తీసుకున్న తర్వాత ఫార్ములా నిర్వహణ సంస్థకు నిధులు చెల్లించాలి. అలాంటిదేమీ జరక్కుండానే నేరుగా నిధులను ఆ సంస్థకు ఇచ్చేశారు.విదేశీ సంస్థకు నిధులు చెల్లింపులు జరిపేటప్పుడు ఆర్బీఐ అనుమతి తీసుకోవాలి. అవేమీ పట్టించుకోలేదు అప్పటి అధికారులు. దీనిపై అప్పటి అధికారులకు ప్రభుత్వం మెమో జారీ చేసింది. ప్రక్రియ వేగంగా జరగాలనే ఉద్దేశంతో చెల్లింపులు జరిపామన్నది అధికారుల వెర్షన్.ఈ వ్యవహారమంతా పురపాలక శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ శాఖకు మంత్రిగా కేటీఆర్ ఉన్నారు. దీనిపై విచారణ చేపట్టాలని మున్సిపల్ అధికారులు ఏసీబీ లేఖ రాయడంతో బీఆర్ఎస్ వెన్నులో వణుకు మొదలైంది. ప్రభుత్వం రేస్ స్కామ్ వ్యవహారాన్ని ఏసీబీకి ఇస్తుందా? లేదా సీఐడీకి ఇస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది.

## సీఆర్ఎస్ యాప్‌ను ప్రారంభించిన హొంమంత్రి అమిత్ షా..

న్యూఢిల్లీ, కేంద్ర హొంమంత్రి అమిత్ షా సెన్సస్ బిల్డింగ్‌లో సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సిఆర్ఎస్) యాప్‌ను ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా ఎవరైనా ఎక్కడి నుంచైనా జనన మరణాలను నమోదు చేసుకోవచ్చు.యాప్ సహాయంతో ఇప్పుడు ఈ రిజిస్ట్రేషన్ పనిని ఇంట్లో కూర్చొని సులభంగా చేయవచ్చు. ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించడం, పొడవైన క్యూలలో నిలబడడం నుండి సామాన్యులకు విముక్తి కల్పించడంలో ఈ యాప్ ప్రభావవంతంగా పనిచేస్తుంది. దీని కోసం ఈ యాప్ ద్వారా జనన మరణాల నమోదు సులభంగా జరుగుతుందని సెన్సస్ ఇండియా 2021 సోషల్ మీడియా ఖాతాల నుండి చెప్పబడింది. ఈ ప్రక్రియ ప్రకారం ఏ వ్యక్తి అయినా పుట్టిన లేదా మరణించిన 21 రోజులలోపు యాప్‌లో జనన లేదా మరణ సంబంధిత సమాచారం, రిజిస్ట్రేషన్‌ను సమర్పించాలి.యాప్ ప్రకారం, మీరు 21 రోజుల్లోగా నమోదు చేసుకోలేకపోతే అదనపు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం దేశంలోని ఏ సామాన్యుడు అయినా 22 నుంచి 30 రోజుల్లోపు రూ.2, 31 రోజుల నుంచి ఏడాదిలోపు రూ.5 ఆలస్య రుసుము చెల్లించాల్సి ఉంటుంది. దీనితో పాటు, పాత సర్టిఫికేట్‌లకు రూ. 10 రుసుము నిర్ణయించబడింది. అంటే గరిష్ట ఆలస్య రుసుము రూ. 10 అవుతుంది. ఈ సందర్భంగా హొంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ పౌరులు ఏ సమయంలోనైనా, ఎక్కడి నుంచైనా, తమ రాష్ట్రంలోని అధికార భాషలో నమోదు చేసుకునేందుకు ఈ అప్లికేషన్ వీలు కల్పిస్తుందని తెలిపారు. దీంతో జనన



మరణాల నమోదు సులువుగా, ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు.దేశంలో జనాభా గణనకు సన్నాహాలు ముమ్మరం చేశారు. జనాభా గణనలో సమాచారాన్ని సేకరించేందుకు మొబైల్ అప్లికేషన్లు కూడా ఉపయోగించబడతాయి. నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్‌పీఆర్)ను తొలిసారిగా తయారు చేయబోతున్నామని చెప్పారు. దీని వల్ల దేశంలో శాంతిభద్రతలు మెరుగుపడి దేశాభివృద్ధికి కొత్త మార్గం ఏర్పడుతుంది. అయితే, జనాభా గణన ఎప్పుడు మొదలవుతుంది. దాని ఫార్మాట్ ఎలా ఉంటుంది అనే దానిపై ఇంకా సమాచారం ఇవ్వలేదు. అలాగే, ప్రతిపక్ష పార్టీలు కుల గణనను నిరంతరం డిమాండ్ చేస్తున్నాయి. దానిపై ప్రభుత్వం ఏమి చర్యలు తీసుకుంది. ఈ ప్రశ్నలన్నింటికీ ఇంకా సమాధానం ఇవ్వలేదు.

## నవంబర్ ఐదు.. తెలంగాణకు రాహుల్‌గాంధీ



హైదరాబాద్, కాంగ్రెస్ పార్టీ రూటు మార్చింది. ఎన్నికల తర్వాత ప్రజలకు దగ్గరగా ఉండాలని భావిస్తోంది. కొత్త కొత్త కార్యక్రమం పేరిట ప్రజల్లో ఉండేందుకు ఆలోచన చేస్తోంది. 2029 సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటి నుంచి స్కెచ్ వేసినట్టు కనిపిస్తోంది. పాత పద్దతులను దూరం పెట్టింది. నిత్యం ప్రజలు, కార్యకర్తలతో దగ్గరయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ. ఈ నేపథ్యంలో నవంబర్ ఐదున తెలంగాణకు రానున్నారు రాహుల్‌గాంధీ.కాంగ్రెస్ పార్టీ వేగం పెంచింది. వచ్చే ఎన్నికల్లో మోదీ సర్కార్‌ను గద్దె దించాలని ప్లాన్ చేస్తోంది. దానికి ఇప్పటి నుంచే మెల్లగా అడుగులు వేస్తోంది. కేవలం ఎన్నికలకు మాత్రమే వస్తామనే అపవాదును తొలగించే ప్రయత్నం చేస్తోంది.లేటెస్ట్‌గా 'సంవిధాన్ సన్మాన్ సమ్మేళన్' కార్యక్రమం పేరిట తెలంగాణకు రానున్నారు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ. నవంబర్ ఐదున హైదరాబాద్‌కు వస్తున్నారు. సంవిధాన్ కార్యక్రమం పేరిట ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నారాయన.నేతలు, కార్యకర్తలతో మమేకం అవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ వైఖరిని విడమరిచి చెబుతున్నారు. సింగిల్ అజెండాతో రాహుల్‌గాంధీ ముందుకెళ్తున్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలన్నది ఆయన ఆలోచన. రాజకీయాలు కొన్ని వర్గాల చేతుల్లో ఉందన్నది ఆయన భావన.దేశ జనాభాలో 90 శాతం మంది వ్యవస్థ బయటే ఉన్నారని, 10 శాతం వ్యక్తుల చేతుల్లో రాజ్యాంగం ఉందని భావిస్తున్నారు రాహుల్‌గాంధీ. మిగతా వర్గాల ప్రయోజనాలు కాపాడేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నది ఆలోచన.సమాజంలోని వివిధ వర్గాలను భాగస్వాములను చేయడానికి తొలుత జనాభా సంఖ్యను నిర్ధారించాల్సిన అవసరాన్ని నొక్కి వక్కానిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి జనాభా లెక్కింపు మొదలుపెట్టాలని కేంద్రం ఆలోచన చేస్తోంది. వెనుకబడిన కులాలు, దళితులు, గిరిజనులు, మైనార్టీలు ఉన్నత కులాలకు చెందిన జనాభా ఎంత ఉందో తెలుసుకునేందుకు కుల గణన ద్వారానే సాధ్యమవుతుందని బలంగా నమ్ముతున్నారు కాంగ్రెస్ అగ్రనేత.పనిలో పనిగా రాష్ట్రాల్లో పార్టీ పరిస్థితి గురించి ఆరా తీయనున్నారు రాహుల్‌గాంధీ. దానికి అనుగుణంగా ప్రణాళికలు రచించనున్నారు. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చేపడుతున్న కార్యక్రమాల గురించి పార్టీ నేతలకు కీలక సూచనలు ఇవ్వనున్నారు.

## బీజేపీ బండి లాగేది ఆయనేనా ?



హైదరాబాద్,బీజేపీ తెలంగాణా మీద ఫోకస్ పెడుతోంది. జమిలి ఎన్నికల నేపథ్యంలో దక్షిణాదిన తెలంగాణా మీదనే బీజేపీ ఆశలు అధికంగా ఉన్నాయి. ఏపీలో జనసేన టీడీపీతో బంధం పటిష్టంగా ఉంది. దాంతో ఏ ఢోకా లేదు. తెలంగాణాలో 2024 ఎన్నికల్లో ఎనిమిది ఎంపీలను గెలుచుకున్న బీజేపీ ఈసారి ఎన్నికలు అంటూ వస్తే మరింతగా బలపడాలని లెక్కలు వేసుకుంటోంది.ఇక తెలంగాణా బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రిగా జి కిషన్ రెడ్డి ఉన్నారు. ఆయన ప్రస్తుతం రెండు బాధ్యతలను మోస్తున్నారు. దాంతో ఆయన ప్లేస్ లో కొత్తవారిని ఎంపిక చేయాలని బీజేపీ చూస్తోంది. అయితే ఆ కొత్త వారు ఎవరు అన్నదే చర్చగా ముందుకు వస్తోంది.కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కి మరో మారు పార్టీ పగ్గాలు అప్పగించాలని కూడా టాక్ నడుస్తోందిట. ఆయన హయాంలో పార్టీ గ్రౌండ్ లెవెల్ దాకా వెళ్ళిందని పక్కా మాస్ లీడర్ గా బండి కమలం పార్టీకి దూకుడు పెట్టించాడు అని అంటున్నారు.బండిని గత ఏడాది ఆ పదవి నుంచి తప్పించారు. ఇపుడు చూస్తే ఒక వైపు కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి దూకుడు ఉంది మరో వైపు చూస్తే బీఆర్ఎస్ కూడా జూలు విదిలిస్తోంది. ఈ రెండు పార్టీలను తట్టుకుని రాజకీయ క్షేత్రంలో నిలబడాలీ అంటే కచ్చితంగా పూర్తి స్థాయిలో పార్టీని పట్టించుకోవాల్సి ఉంది అని అంటున్నారు. దాంతో పాటు ఢీ అంటే ఢీ కొట్టే నాయకత్వం అవసరం అని కూడా అంటున్నారు. ఆ విధంగా చూసుకుంటే బండికే ప్రయారిటీ ఇస్తారు అని అంటున్నారు. అదే సమయంలో ఎంపీగా ఉన్న ఈటెల రాజేందర్ కి కూడా పగ్గాలు దక్కవచ్చు అని అంటున్నారు. ఆయనకు కేంద్ర మంత్రి పదవి ఇవ్వనిది అందుకే అని కూడా చెబుతున్నారు.ఈటెల కూడా తన ఈటెల లాంటి విమర్శల్తో ప్రత్యర్థులకు హడల్ పుట్టిస్తారు అని అంటున్నారు. అయితే ఈటెలను కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకుని బండికే పార్టీ బాధ్యతలు అప్పగించే చాన్స్ ఎక్కువగా ఉంది అని అంటున్నారు. ఇక కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉంటూ రాష్ట్ర పార్టీ విషయంలో అనుకున్న విధంగా స్పందించడం లేదని అంటున్నారు. తొందరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయని అలాగే జీహెచ్ఎంసీ ఎన్నికల మీద కూడా బీజేపీ కన్ను ఉందని అంటున్నారు. గతసారి అధికంగా కార్పోరేటర్లను గెలుచుకుని బీజేపీ మేయర్ పీఠానికి చేరువగా వచ్చింది. ఈసారి మరింతగా దూకుడు చేస్తే అనుకున్నది నెరవేరు తుంది అన్న ఆశ ఉంది. మొత్తానికి తొందరలోనే తెలంగాణాకు కొత్త అధ్యక్షుడు వస్తారని అంటున్నారు. అది బండి నా లేకా ఈటెలనా అన్నది చూడాల్సి ఉంది.

### జగిత్యాల జిల్లాలో దారుణం.. భార్యను హతమార్చిన భర్త


జగిత్యాల : కలకాలం జీవితాంతం తోడుంటానని అగ్ని సాక్షిగా మనువాడిన భర్తే ఆమె పాలిట కాలయముడయ్యాడు. అనుమానం పెనుభూతంగా మారి.. పెళ్లినాటి ప్రమాణాలను మర్చిపోయి భార్యను అత్యంత కిరాతకంగా హతమార్చాడు ఈ విషాదకర సంఘటన జగిత్యాల జిల్లామల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వెలుమల సునీత(30), రమేష్ దంపతులు. కొంతకాలంగా కుటుంబంలో కలహాలు చోటు చేసుకుంటున్నాయి. సునీతపై అనుమానం పెంచుకున్న రమేష్ బుధవారం ఆమెను హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. సునీత మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పాకిస్తాన్ ఏం చేయలేదు.. ఫరూక్ అబ్దుల్లా కీలక వ్యాఖ్యలు

జమ్ము కశ్మీర్: జమ్మూకశ్మీర్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఉగ్రవాదుల దాడులు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. ఈ దాడులపై స్పందించిన నేషనల్ కాన్ఫరెన్స్ నేత, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లా పాకిస్థాన్‌ను తీవ్రంగా టార్గెట్ చేశారు.జమ్మూ కాశ్మీర్‌లో పాకిస్తాన్ తన ప్రణాళికలను ఎప్పటికీ విజయవంతం చేయలేదని అబ్దుల్లా అన్నారు. ఈ ప్రాంతాన్ని పాకిస్థాన్‌లో విలీనం చేయాలని కోరుకునే వారు ఎప్పటికీ విజయం సాధించలేరు. భారతదేశం బలం దాని భిన్నత్వం, ఏకత్వంలో ఉంది. పరస్పర సౌభ్రాతృత్వాన్ని బలోపేతం చేసి, ద్వేషాన్ని తొలగించాలని ఫరూక్ అన్నారు. తద్వారా దేశంలో శాంతి, పురోగతి, అభివృద్ధి వాతావరణం ఉంటుంది.జర్నలిస్టులతో మాట్లాడుతూ.. కొత్త ప్రభుత్వం నుండి ప్రజలు పెద్ద మార్పులను ఆశిస్తున్నారని, రాబోయే సంవత్సరాల్లో జమ్మూ కాశ్మీర్ అభివృద్ధిలో కొత్త శిఖరాలను తాకుతుందని ఆశిస్తున్నట్లు ఫరూక్ అన్నారు. వేర్పాటువాదులను లక్ష్యంగా చేసుకుని, పాకిస్థాన్‌లో చేరాలని ఆలోచిస్తున్న వారు ఎప్పటికీ విజయం సాధించలేరని, జమ్మూ కాశ్మీర్ భారతదేశానికి కిరీటమని, ఎప్పటికీ అలాగే ఉంటుందని అన్నారు. ఇక్కడ పాకిస్థాన్ ఎప్పటికీ విజయం సాధించదు.

మత ద్వేషం మన ఐక్యతకు ముప్పు

దేశంలో పెరుగుతున్న మత విద్వేషాన్ని ఐక్యతకు ముప్పుగా అభివర్ణించిన అబ్దుల్లా, దానిని అంతం చేయడం చాలా ముఖ్యమని, మన భాష, మతం, సంస్కృతి ఏదైనా సరే మన దేశంలోని వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, మనం భారతీయులమని అన్నారు. అబ్దుల్లా ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ.. మనం ఐక్యంగా ఉండాలని, లేకుంటే భారతదేశ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందని అన్నారు. రఘునాథ్ మార్కెట్ గురించి ప్రస్తావిస్తూ.. లెఫ్టినెంట్ గవర్నర్ 2022లో దర్బార్ మూవ్ సంప్రదాయాన్ని నిలిపివేసిన తర్వాత ఈ మార్కెట్ పాత శోభను కోల్పోతోందని అబ్దుల్లా అన్నారు. మహారాజులు ప్రారంభించిన ఈ సంప్రదాయం ప్రకారం.. ప్రభుత్వం ఆరు నెలలు శ్రీనగర్‌లో, ఆరు నెలలు జమ్మూలో పనిచేసేది. రఘునాథ్ బజార్‌కు మళ్లీ పాత మెరుపు రావాలి. సోదరభావాన్ని బలోపేతం చేయడం, రెండు ప్రాంతాలను మరింత దగ్గర చేయాలనే లక్ష్యంతో ఈ సంప్రదాయాన్ని



ప్రారంభించామని, దానిని పునరుద్ధరించాలని ఆయన అన్నారు.జమ్మూ కాశ్మీర్ పురోగతికి నేషనల్ కాన్ఫరెన్స్ కట్టుబడి ఉందని, రోడ్ల పరిస్థితిని మెరుగుపరచాలని.. స్మార్ట్ సిటీలలో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అబ్దుల్లా అన్నారు. ఈ ప్రభుత్వం నుండి ప్రతి ఒక్కరికి అంచనాలు ఉన్నాయి. అలాగే జమ్మూ కాశ్మీర్ అభివృద్ధి చెందాలని, నిరుద్యోగం అంతం కావాలని, యువతకు ఉపాధి లభించాలని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని నేను కూడా కోరుకుంటున్నాను. రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలనే డిమాండ్‌పై ఆయన మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర హోదాను పునరుద్ధరించిన తర్వాత, స్థానిక అధికారులను ఉన్నత పదవుల్లో నియమిస్తారు. గత 75 ఏళ్లలో స్థానిక అధికారులు రాష్ట్రాన్ని పరిపాలించి దేశంలోనే అత్యంత ప్రగతిశీల రాష్ట్రంగా తీర్చిదిద్దారని, అయితే గత ఐదేళ్లలో మనం దిగజారిపోయామని, మళ్లీ కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలని అన్నారు.

### జీడిమెట్లలో బస్సు ఢీకొని వ్యక్తి మృతి..

హైదరాబాద్,ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన జీడిమెట్ల పరిధిలో చోటుచేసుకుంది. బుధవారం ఉదయం షాపూర్‌నగర్ చౌరస్తాలో రహదారి దాటుతున్న వ్యక్తిని వేగంగా దూసుకొచ్చిన ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది.

## సంపాదకీయం

**గురువారం 31-10-2024**

# లోక్‌పాల్ ఏర్పాటు...దర్యాప్తు సంస్థలకు స్వయంప్రతి

దర్యాప్తు సంస్థలంటే ప్రతి ఒక్కరికి భయం ఉండాలి. కానీ ఇప్పుడా భయం లేకుండా పోయింది. ఎందుకంటే రాజకీయ అవినీతికి సంబంధించి ఒక్క కేసులో కూడా దోషులకు శిక్షలు పడ్డ దాఖలాలు లేవు. దర్యాప్తు సంస్థల నిజాయితీ కూడా లోపించింది. ఏ కేసును కూడా పక్కాగా విచరణ చేసి ధృవీకరించలేకపోతున్నారు. దెబ్బతిన్న దర్యాప్తు సంస్థల ప్రతిష్టను పునరుద్ధరించాలి. అలాగే ప్రజల్లో కోల్పోయిన విశ్వాసాన్ని నిల బెట్టాలి. అంతకన్నా ముఖ్యంగా ప్రజాతంత్ర, రాజ్యాంగ బద్ధ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు ఇంతకాలం జరిగిన ప్రయత్నాలను ఇకముందు సాగకుండా చూడాలి. రాజ్యాంగ సంస్థలను, జవాబుదారీతనాన్ని, పారదర్శక తను, ప్రజా స్వామ్యాన్ని కాపాడుకోగలం అన్న నమ్మకాన్ని కల్పించాలి. గతంలో అధికారుల అవినీతి వ్యవహారం కూడా సిబిఐ పరువునే కాకుండా మోడీ ప్రభుత్వ ప్రతిష్టను కూడా మంటకలిపాయి. అందువల్ల ఇలాంటి వ్యవహారాలు ఇక ముందు సాగకుండా మొత్తం వ్యవహారాలను సమీక్షించి దర్యాప్తు సంస్థలను బలోపేతం చేయాలి. నిబద్దత కలిగిన, నిఖార్సయిన అధికారులను నియమించాలి. ఆయా సంస్థలు ప్రజల్లో విశ్వాసం కోల్పోయే ప్రమాదం లేకుండా జాగ్రత్త పడాలి. లోక్‌పాల్ సంస్థను ఏర్పాటు చేసి దాని ఆధ్వర్యంలో కేసులు దర్యాప్తు చేపట్టడం ద్వారా కేంద్రం తన నిజాయితీని నిరూపించుకోవాలి. రాజకీయ అవినీతి నిర్మూలనకు లోక్‌పాల్ ఒక్కటే శరణ్యం. దీనికి కసరత్తు చేయాలి. ఎవరు అవినీతికి పాల్పడినా లోక్‌పాల్ పరిధిలోకి తీసుకుని రావాలి. ఇప్పటికే ఆయా రాష్ట్రాల సిఎంలు, పలు రాజకీయ పార్టీల నేతలపై జరుగుతున్న దాడులపై ఆరోపణలుఉన్నాయి. బెదిరింపులకు పాల్పడుతున్నారని టిఆర్‌ఎస్, తృణమూల్, ఆప్ కాంగ్రెస్ తదితర పార్టీలో నిత్యం ఆరోపిస్తున్నాయి. అంతేగాకుండా మీ సిబిఐకి బెదరమన్న అల్టిమేటం ఇస్తున్నాయి. ఇలా దర్యాప్తు సంస్థల ప్రతిష్ట దెబ్బతినకుండా, పటిష్టంగా స్వతంత్రగా పనిచేసేలా చేయడం ప్రభుత్వ విధి. అందుకు తగువిధంగా ప్రయత్నాలు చేయాలి.గత దశాబద్ద కాలంలో అంటే మోడీ హయాంలో నమోదైన ఇడి, సిబిఐ కేసుల్లన్నీ నీరుగారి పోతున్నాయి.ఈ కారణంగా చట్టానికి వ్యతిరేకంగా ఏ పని చేసినా శిక్ష తప్పదన్న భయం లేకూండా పోతోంది. అయితే ఇటీవల కేంద్ర దర్యాప్తు సంస్థలను అధికార పార్టీ తన స్వార్థం కోసం వినియోగించుకుటోందన్న భావన ఉంది. బిజెపి దీనిని తనకు అనుకూలంగా మలచుకుందన్న ఆరోపణలు ఉన్నాయి. విపక్ష పార్టీలు పని గట్టుకుని దీనిపై ఆరోపణలు చేస్తూనే ఉన్నాయి. దీనికి తగ్గట్లుగా దర్యాప్తు సంస్థల పనితీరు కూడా ఉంది.నిజానికి దర్యాప్తు సంస్థలను స్వతంత్రంగా పనిచేసుకోనివ్వాలి. రాజకీయాలకు అతీతంగా నడుచుకునేలా చేయాలి. అలా చేస్తేనే రాజకీయ పార్టీలకు కూడా భయం ఉంటుంది. అలాగే కేంద్ర దర్యాప్తు సంస్థల్లో అవినీతి ,అక్రమాలకు తావు లేకుండా స్వతంత్రంగా పసనిచేసుకునేలా చేయాలి. సుప్రీంకోర్టు తరహాలో స్వతంత్రంగా దర్యాప్తు సంస్థలను బలోపేతం చేయాలి. నిజాయితీ లేని అధికారుల కారణంగా సిబిఐ లాంటి సంస్థపైనా విమర్శలు వస్తున్నాయి. నిజానికి కేంద్రం ఆధీనంలోని ఇడి,సిబిఐ, విజిలెన్స్, ఐబి, రా వంటి దర్యాప్తు సంస్థలను పటిష్టంగా ఉంచాలి. వాటిని రాజకీయాలకు అతీతంగా పటిష్టం చేయాలి. వాటంతట అవి సమర్థంగా పని చేసేలా అందులో రాటుదేలిన సమర్థులైన అధికారులను చేర్చాలి. కానీ అలా జరగడం లేదు. కాంగ్రెస్ హయాంలో ఈ సంస్థలను దిగజార్చారు. వాటిని రాజకీయ స్వప్రయోజనాలకు ఉపయోగించుకున్నారు. రాజకీయ నాయకుల ప్రమేయలం వల్ల దేశ ప్రతిష్టను దెబ్బతీస్తుందన్న జ్ఞానం అధికారులకు లేకపోవడం దారుణం కాక మరోటి కాదు. దర్యాప్తు సంస్థలు అవినీతి కేంద్రాలుగా మారితే విదేశీయుల దృష్టిలో మనం ఎంతగా పలుచన అవుతామో గమనించడం లేదు. నీతి, నిజాయితీ, నిష్పాక్షికత, విశ్వసనీయతకు మారు పేరుగా నిలవాల్సిన అత్యున్నత కేంద్ర నేర దర్యాప్తు సంస్థ రాజకీయ ఆశ్రిత పక్షపాతం, అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలోనే అత్యున్నతమైన ఈ దర్యాప్తు సంస్థలో గతంలో చోటుచేసుకుంటున్న కొన్ని పరిణామాలు సిబిఐ విశ్వసనీయతనే ప్రశ్నార్థకం చేసాయి. వృత్తి నైపుణ్యం, సామర్థ్యం ప్రాతిపదిక కాకుండా తనకు నచ్చిన వారిని, కళంకితులను ఉన్నత స్థానాల్లోకి చొప్పించి ఈ సంస్థ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ హయాంలో మొదలైన ప్రయత్నాలు మోడీ హయాంలో కూడా కొనసాగుతున్నాయి. చాలా కాలంగా ఇలాంటి నియామకాల కారణంగా సంస్థ ప్రతిష్ట బజారున పడింది. రాజ్యాంగం పైన, రాజ్యాంగ విలువల పైన, పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంస్థలపైన వీసమెత్తు కూడా గౌరవం లేని నేతలు ప్రధానులు కావడంతోనే సిబిఐ తాబేదారు సంస్థగా మారింది. ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం దీనిని సంస్కరించడం ద్వారా సిబిఐని ఇతర దర్యాప్తు సంస్థలను బలోపేతం చేయాలి. ఈ సంస్థలు ఎలాంటి కేసునైనా సమర్థంగా దర్యాప్తు చేయగలగాలి. ఎపిలో కడపకు చెందిన మాజీ ఎంపి వివేకా నందరెడ్డి హత్య కేసులో సిబిఐ దర్యాప్తులో పురోగతి కనిపించడం లేదు. ఈ కేసులో దర్యాప్తు నత్తనడకన జరగడం, హత్యకు గల కారణాలు గుర్తించకపోవడంతో సంస్థ పనితీరుపై అనుమానాలు కలుగుతున్నాయి. కొందరు అధికారుల తీరు కారణంగా కూడా సంస్థ ప్రతిష్ట మసకబారగలదు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ హయాం నుంచే పాలకపార్టీ ప్రత్యర్థులను వేధించడానికి సిబిఐని ఒక పావుగా కేంద్రం వాడుకుంటూ వచ్చింది. అధికారంలో ఉన్న పెద్దల కనుసన్నల్లో దర్యాప్తులు సాగుతున్నాయి. రాజకీయ వ్యతిరేకులను లోపలేయడం కోసం మాత్రమే సిబిఐ పనిచేస్తుందా అన్న రీతిలో కేసుల తీరు ఉంటోంది. ఇలా చేయడం అలవాటు చేసుకున్న సిబిఐకి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరింత విమర్శలను మూటగట్టుకుంది. విపక్షాలను వేధించడానకే సిబిఐ పనిచేస్తోందన్న విమర్శలు ఇటీవల ఎక్కువయ్యాయి. ఎందుకంటే కాంగ్రెస్ కంటే భిన్నంగా మోడీ ఉంటారనుకున్నా.. ఉండలేక పోతున్నారు.

# సమస్యల ఊబిలో అబ్దుల్లా ఉక్కిరిబిక్కిరి



జమ్ము కశ్మీర్: అబ్దుల్లా కుటుంబానికి కాశ్మీర్‌తో అవినాభావ సంబంధం ఉంది. గత వారం కాశ్మీర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఒమర్ అబ్దుల్లా 'నేను మళ్లీ వచ్చేశా" అని ట్వీట్ చేశారు. రావడమైతే వచ్చారు కానీ, కాశ్మీర్ విషయంలో ఆయన ఏం చేయబోతున్నారనేది ఒక ప్రశ్నగా మారింది. బ్రిటన్‌లో పుట్టి పెరిగిన ఈ 54 ఏళ్ల కొత్త ముఖ్యమంతి అబ్దుల్లా వంశంలో మూడవ తరం నాయకుడు. ఆయనకు రాష్ట్రవ్యాప్తంగా 3.20 కోట్ల మంది అనుచరులున్నారు. ప్రమాణ స్వీకారం సందర్భంగా ఆయన షేర్వానీ, పజామాను ధరించడాన్ని బట్టి ఆయన తన కుటుంబ సంప్రదాయాలకు, స్థానికత్వానికి, కొనసాగింపునకు కట్టుబడి ఉండబోతున్నారని అర్థమవుతోంది. జమ్మూ కాశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతానికి మరిన్ని అధికారాలను కట్టబెట్టాలని, పాకిస్తాన్‌తో చర్చలను పునరుద్ధరించాలని, జమ్మూ కాశ్మీర్‌ను ఇతర రాష్ట్రాల కంటే భిన్నంగా ఆదరించాలని ఆయన కుటుంబం, ఆయన నాయకత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ గట్టిగా కోరుకుంటున్నాయి. అయితే, ఒమర్ అబ్దుల్లాలో అప్పటికీ, ఇప్పటికీ కొద్దిగా మార్పు వచ్చింది. ఆర్టికల్ 370ని బుట్టదాఖలు చేసిన తర్వాత రాజ్యాంగం మీద ప్రమాణ స్వీకారం చేసిన మొట్టమొదటి ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా.చాలా ఏళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్నందువల్ల ఆయనలో ఒక విధమైన రాజకీయ జ్ఞానోదయం కలిగినట్టు కనిపిస్తోంది. ఆయన పార్టీ ఒక కొత్త రాజకీయ వాస్తవంతో మనుగడ సాగించక తప్పదనే వాస్తవం ఇప్పుడు ఆయనకు పూర్తిగా అవగతమైంది. ప్రస్తుతం కాశ్మీర్‌లో అసలు సిసలు లౌకికవాదాన్ని, మత సామ రస్యాన్ని ఆచరించవలసిన అగత్యాన్ని కూడా ఆయన గుర్తించారనుకోవాలి. కాశ్మీర్ కు మరింత రాష్ట్ర ప్రతిపత్తి కావాలన్న పక్షంలో ఆయన ప్రాథమికంగా కొన్ని సానుకూల పరిస్థితులను కల్పించాల్సి ఉంటుంది. అంతేకాదు, తన ప్రభావం కాశ్మీర్ వరకే పరిమితమని, జమ్మూలో కాషాయ జెండా ఎగురుతోందని ఆయన గుర్తుంచుకోవాల్సి ఉంటుంది. జమ్మూ కాశ్మీర్‌లో తమ అధికారం అయిదేళ్ల పాటు అవిచ్ఛిన్నంగా కొనసాగాలన్నా, రాజకీయ ప్రశాంతత ఏర్పడాలన్నా తాను తప్పనిసరిగా కొన్ని త్యాగాలు చేయాల్సి ఉంటుంది. ఇక 1990 నుంచి ఇప్పటి వరకూ లక్ష మందికి పైగా పౌరులు, సైనికులు ప్రాణాలు కోల్పోయిన నయా కాశ్మీర్ లో ఒమర్ అబ్దుల్లాకు లక్షలాది మంది ఓటర్లు పట్టం కట్టారంటే అందులోని అంతరార్థమేమిటో అబ్దుల్లా తప్పకుండా అర్థం చేసుకోవాలి. ఆయనలోని ఆధునిక భావాలు, దూకుడు తత్వం పాలనలో ఆయనకు కొంత ఉపయోగపడే అవకాశం ఉన్నప్పటికీ, తాను కూర్చున్నది ముళ్ల సింహాసనమనే విషయం ఆయన ఇప్పటికే గ్రహించుకుని ఉంటారు. అంపశయ్య మీద ఉన్న పాలనకు మళ్లీ ప్రాణం పోయడం ఇప్పుడు అత్యంత అవసరం.

### వ్యవహారశైలిలో మార్పు

ఇవన్నీ జరగాలన్న పక్షంలో ఆర్థిక, రాజకీయ సుస్థిరత ఏర్పడాల్సిన అవసరం ఉంది. ఎక్కువ కాలం కేంద్ర ప్రభుత్వ పాలనలోనే ఉన్న ఈ రాష్ట్రంలో 1951 నుంచి ఇటీవలి వరకు అబ్దుల్లా కుటుంబం 34 ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించింది. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత ఈ రాష్ట్రం కేంద్రపాలిత ప్రాంతంగా మారింది. రాజకీయాలు, పాలన అన్నవి ఈ కుటుంబం రక్తంలోనే ఉన్నాయి. అధికారానికి సంబంధించిన పరిమితులు, పరామితులు ఈ కుటుంబానికి క్షుణ్ణంగా తెలుసు. కొత్తగా ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన ఒమర్ అబ్దుల్లా ప్రస్తుతం పూర్తి మెజారిటీతో అధికారంలో ఉన్నందువల్ల ఆయన వేర్పాటువాద శక్తుల ఒత్తిడికి తలవంచాల్సిన అవసరం లేదు. చిన్నాచితకా పార్టీలన్నీ ఓడిపోయాయి.ఉగ్రవాద సంస్థలకు చెందిన స్వతంత్ర అభ్యర్థులు కూడా విజయం సాధించలేదు. మెహబూబా ముఫ్తీకి చెందిన పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీకి అటు కాశ్మీర్‌లో గానీ, ఇటు జమ్మూలో గానీ ఒక్క సీటు కూడా లభించలేదు. బీజేపీ సహకారం లభించినందు వల్ల ఈ ప్రభుత్వానికి తిరుగులేని మెజారిటీ లభించింది. ఈ ప్రాంతం మీద చాలా కాలం పాటు ఆధిపత్యం చెలాయించిన కాంగ్రెస్ పార్టీకి కేవలం ఆరు స్థానాలు మాత్రమే లభించాయి. జమ్మూకు చెందిన ఒక ఆదివాసీ హిందువుకు ఉప ముఖ్యమంత్రి పదవిని కట్టబెట్టడం ద్వారా జమ్మూకు కూడా సరైన ప్రాతినిధ్యం లభించినట్టయింది.కేంద్ర ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్ కు రాష్ట్ర ప్రతిపత్తిని కల్పించే అవకాశం ఉంది కానీ, ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆర్టికల్ 370 తిరిగి వచ్చే అవకాశం మాత్రం లేదు. అబ్దుల్లాకు ఈ విషయం బాగా తెలుసు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఆయన ప్రసంగిస్తూ, 'ఆర్టికల్ 370ని పునరుద్ధరించే విషయాన్ని మరచిపోవడం మంచిది. జమ్మూ కాశ్మీర్‌కు మరింత ప్రాధాన్యం ఇచ్చే అవకాశం కూడా లేదు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉన్నంత కాలం ఆర్టికల్ 370ని పునరుద్ధరించే అవకాశం లేదు. ఒకవేళ వాగ్దానం చేసినా ఓటర్లు నమ్మే స్థితిలో లేరు. అందువల్ల ఆ విషయాలను ఇక పక్కన పెట్టేయండి' అని వ్యాఖ్యానించారు. నిజానికి, 2019 తర్వాత కేంద్రం తీసేసుకున్న అధికారాలన్నింటినీ తిరిగి ఇచ్చేంత ఔదార్యాన్ని మోడీ ప్రదర్శిస్తారని ఆశిస్తున్నట్టు కూడా ఆయన చెప్పారు.

### సరికొత్త అనుభవాలు

మోడీ ప్రభుత్వంతో ఘర్షణకు దిగే పక్షంలో తాము ముందుకు పోలేమని, ఏదీ సాధించలేమని ఒమర్ అబ్దుల్లాకు అర్థమైపోయింది. కేంద్రపాలిత ప్రాంతానికి రాష్ట్ర ప్రతిపత్తిని కల్పించడంతో పాటు, ఇతర రాష్ట్రాల మాదిరిగానే ఈ రాష్ట్రానికి కూడా అధికారాలు అప్పగించే విషయంలో మాత్రమే ఆయన మోడీ మీద ఒత్తిడి తీసుకు రాగలరు. మోడీతో ఢీ అంటే ఢీ అనడం వల్ల ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు ఏం జరిగిందో కూడా ఆయన గమనించి ఉండాలి. సైద్ధాంతిక పోరాటాలను బట్టి సమర్థ పాలనను నిర్ణయించడం జరిగే పని కాదు. ప్రధానమంత్రి పదవిని ఆశిస్తున్న పలువురు ప్రతిపక్ష నాయకుల జాబితాలో అబ్దుల్లా ప్రస్తుతానికి చేరకపోవడం మంచిది. కేంద్ర పాలిత ప్రాంతానికి ఒనగూడిన రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు ఆయన ఎంతగా కాపాడుకుంటే అంత మంచిది. రాళ్లు విసరడాన్ని నిరోధించడం, చొరబాట్లకు, ఉగ్రవాద కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం వంటివి ఆయన ప్రభుత్వం కూడా కొనసాగించాల్సిన అవసరం ఉంది. పర్యాటకుల రాకపోకలతో, ప్రాథమిక సదుపాయాల కల్పనతో ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్న జమ్మూ కాశ్మీర్ కు ఆయన మరింతగా చేయూతనందించాల్సిన అవసరం ఉంది.జమ్మూ కాశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో అనేక ప్రాథమిక సదుపాయాల నిర్మాణం కోసం కేంద్రం ఇప్పటికే దాదాపు లక్ష కోట్ల రూపాయలు పెట్టుబడి పెడుతోంది. ఆ ప్రాజెక్టులన్నీ వేగంగా అమలు జరుగుతున్నాయి. రాష్ట్రానికి మరింతగా దేశ, విదేశీ పెట్టుబడులు రావడానికి ఒమర్ అబ్దుల్లా ప్రయత్నించడం మంచిది. మత సామరస్యాన్ని పెంపొందించ్ డంతో పాటు, కాశ్మీరీ పండిట్ల పునరావాసానికి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

# దక్షిణాదికి జన బలం కావాల్సిందేనా?




హైదరాబాద్,ఒకప్పుడు ఒకరిద్దరు ముద్దు.. ముగ్గురు అసలే వద్దూ అంటూ జనాభా నియంత్రణపై ప్రభుత్వాలే ప్రచారం చేశాయి. అయితే, ఇప్పుడు కాలం మారింది. జనాభా నియంత్రణ చేయనే చేయొద్దు. ముగ్గురు పిల్లలు.. అంతకుమించి అయితేనే ముద్దు అంటున్నారు. ఒకరిద్దరు వద్దే వద్దని సలహాలిస్తున్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం స్టాలిన్ ఇటీవల పలు సందర్భాల్లో ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. ఇద్దరి కంటే ఎక్కువమంది పిల్లలను కనాలంటూ పిలుపునిస్తున్నారు. లేకపోతే, భవిష్యత్తులో పెను ప్రమాదం తప్పదంటుని, భారతదేశంలో దక్షిణాది రాష్ట్రలా ఉనికి సన్నగిల్లుతుందని చెబుతున్నారు. ఈ నేతలు పిల్లలపై చేసిన వ్యాఖ్యలతో.. కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ ప్లాన్, దాని ప్రభావం జనాభా తగ్గుతున్న దక్షిణాది రాష్ట్రాలపై ఎలా ఉండబోతుందనే చర్చను మరోసారి తీసుకొచ్చింది.

### ఎక్కువ మంది పిల్లలున్న కుటుంబాలకు ప్రోత్సాహకాలు

దక్షిణ భారత రాష్ట్రాల్లో వృద్ధాప్య జనాభా పెరుగుతున్న నైనంపై ఇటీవల సీఎం చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేసిన తర్వాత ఏపీలో కీలక మార్పులు చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉన్న కుటుంబాలకు ప్రోత్సాహకాలు అందించడం, దంపతులకు ఎక్కువ మంది పిల్లలు పుట్టేలా ప్రోత్సహించే కార్యక్రమాలు ప్లాన్ చేస్తున్నారు. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయకుండా నిరోధించే పాత చట్టాన్ని రద్దు చేసినట్లు కూడా చంద్రబాబు తెలిపారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎక్కువ మంది పిల్లలను కనేలా కుటుంబాలను ప్రోత్సహించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు స్పష్టం అయ్యింది. ఇప్పటికే గతంలో ఉన్న ఇద్దరు పిల్లల చట్టాన్ని ఆగస్టు 7న రాష్ట్ర కేబినెట్ రద్దు చేసింది.ఈ నేపథ్యంలో ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారు మాత్రమే పోటీకి అర్హులయ్యేలా కొత్త చట్టాన్ని తీసుకురాబోతున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. అనేక జిల్లాల్లో యువత ఇతర ప్రాంతాలకు, విదేశాలకు వలస వెళ్లిపోవడంతో గ్రామాల్లో వృద్ధులు మాత్రమే మిగిలి ఉన్నారని చంద్రబాబు తాజాగా వెల్లడించారు.వృద్ధుల జనాభా పెరుగుతోంది అంటే పని చేసే జనాభా తగ్గుతోందని అర్థం. ఇది ప్రధానంగా మానవ వనరుల కొరతకు దారి తీస్తుంది. అలాగే దక్షిణాదిలో జనాభా పెరుగుదల ఆగిపోవడం వల్ల పార్లమెంటులో ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనలున్నాయి. ఆ సంఖ్య తగ్గితే రాజకీయ బలం తగ్గిపోతుంది. ఎక్కువ సీట్లు ఉన్న రాష్ట్రాలు తమ డిమాండ్లు సాధించుకోవడంలో ముందుంటాయి. అందుకే, ఇటీవల కాలంలో కేంద్రం ఇచ్చే వాటలో దక్షిణాది రాష్ట్రాలు నష్టపోయాయనే వాదన ఉంది.

2050 నాటికి, ప్రతి ఐదుగురిలో ఒకరు 60 ఏళ్లు పైబడిన వారే భారతదేశంలో వృద్ధాప్య జనాభా పెరగరడం, సంతానోత్పత్తి రేటు తగ్గిపోవడాన్ని ఇటీవలి డేటా స్పష్టం చేస్తోంది. దీని ప్రకారం, 2050 నాటికి, ప్రతి ఐదుగురిలో ఒకరు 60 ఏళ్లు పైబడి ఉంటారని తెలుస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో అయితే ఇది మరింత ఎక్కువగా జరుగుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. సంవత్సరాలుగా, దక్షిణాది రాష్ట్రాలు వారి మొత్తం సంతానోత్పత్తి రేటు క్రమంగా తగ్గిపోతున్నట్లు గమనించాయి. ఇది సాధారణ స్థాయి కంటే మరింత దిగువకు పడిపోవడంతో ఆందోళనలు పెరుగుతున్నాయి. %చీఖీనా%-5 ప్రకారం సంతానోత్పత్తి జాతీయ సగటు రేటు 2.0 కాగా, తెలంగాణలో అది 1.8 గా ఉంది. అదే ఆంధ్రప్రదేశ్‌లో అది 1.7గా ఉంది. ఇక, దక్షిణాది రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు 1.6 వద్ద జాతీయ సగటు 2 కంటే కొంచెం తక్కువగా ఉంది. సంతానోత్పత్తి రేటు 1.8 కంటే తక్కువగా ఉంటే సంబంధిత దేశ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల మీద ప్రభావం చూపుతుందని ముంబయ్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సైన్సెస్ చెబుతోంది.

2021, 2036 మధ్య భారతదేశ జనాభాలో వృద్ధుల నిష్పత్తి.. ఇక, ఇండియా ఏజింగ్ రిపోర్ట్ 2023 ప్రకారం, 2021, 2036 మధ్య భారతదేశ జనాభాలో వృద్ధుల నిష్పత్తి ఉత్తరాదిలో 3 నుండి 4%తో పోలిస్తే దక్షిణాదిలో 6 నుండి 7% పెరుగుతుంది. దక్షిణాదిలో ఆయుర్దాయం కూడా ఎక్కువగానే ఉంది. అయితే, ఉత్తరాది రాష్ట్రాల కంటే చాలా ముందుగానే దక్షిణాది రాష్ట్రాలు తక్కువ సంతానోత్పత్తి రేటు పెరిగింది. గణాంకాల ప్రకారం, ఉత్తరప్రదేశ్ 2025లో ఈ సంతానోత్పత్తి స్థాయిని చేరడానికి సిద్ధంగా ఉంది. ఇది ఆంధ్రప్రదేశ్ తర్వాత 20 సంవత్సరాల కంటే ఎక్కువనే చెప్పాలి. అందుకే, ఉత్తరాదికి ముందే జనాభా తగ్గుతున్న దక్షిణాది రాష్ట్రాలు దీనికి మూల్యం చెల్లించుకుంటాయనే భయాలు ఉన్నాయి.

### ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన

ఇక, జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాలని కేంద్రం ఆలోచిస్తున్నట్లు నివేదికలు వెలువడుతున్నాయి. దీనితో, దక్షిణాది రాష్ట్రాల్లో నియోజవర్గాలు తగ్గుతాయనే ఆందోళన పెరిగింది. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా, దక్షిణాదితో పోలిస్తే ఎక్కువ లోక్‌సభ స్థానాలు, ఎక్కువ జనాభా ఉన్న ఉత్తర భారత రాష్ట్రాలకు వెళతాయి. అది ఉత్తరాదికి రాజకీయ ప్రయోజనాన్ని ఇస్తుంది. ఇక, కొత్త జన గణన తర్వాత జరగాల్సిన డీలిమిటేషన్ ప్రక్రియ, లోక్‌సభ నియోజకవర్గాలు తక్కువగా ఉండటం వల్ల జాతీయ నిర్ణయాధికారంలో దక్షిణాది రాష్ట్రాల ప్రభావం తగ్గిపోతుందనే భయం బలంగా ఉంది. అందుకే, దక్షిణాది రాష్ట్రాల సీఎంలు చంద్రబాబు, స్టాలిన్ వ్యాఖ్యలకు కర్ణాటక, తెలంగాణ, కేరళల నుండి కూడా మద్దతు లభిస్తుంది. ఇవి ఇప్పటికే పార్లమెంటులో.. కేంద్ర నిధుల పంపిణీలో జనాభా

# వైసీపీ హయాంలో భారీ స్కాం

విశాఖ, వైసీపీ హాయంలో ఎక్సైజ్ శాఖలో కోట్ల రూపాయల భారీ కుంభకోణం జరిగిందని, జగన్మోహన్ రెడ్డి ఎక్సైజ్ డిపార్టుమెంట్‌నే లేపేసారని, ఆ డిపార్ట్‌మెంట్ లేకుండా చేసిన వ్యక్తి జగన్ అని జనసేన ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విశాఖలో మీడియాతో మాట్లాడుతూ.. మద్యంలో వైసీపీ నేతలు అడ్డంగా దోచుకున్నారని ఆరోపించారు. పూర్తి స్థాయిలో విచారణ చేస్తే... మిథున్ రెడ్డి అండ్ కో బాగోతాలు బయట పడతాయన్నారు. లిక్కర్ స్కాంలో మిథున్ రెడ్డి, కసిరెడ్డి పాత్ర ఉందన్నారు. మద్యం షాపులో కూడా వైసీపీ నేతలు భారీగా దోచుకున్నారని, ఔట్ సోర్స్ విభాగం ఏర్పాటు చేసి కొట్ల రూపాయలు కొల్లగట్టారని ధ్వజమెత్తారు. రాజ్ కసిరెడ్డి అనే బీనామీని విచారణ చేస్తే కొన్ని కోట్ల రూపాయల సొమ్ము బయట పడుతుందన్నారు. ఎక్సైజ్ శాఖలో జరిగిన అవినీతి అక్రమాలపై మంత్రి కొల్లు రవీంద్రకు ఫిర్యాదు చేస్తానన్నారు. వైసీపీ పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నవారు ఒక్కరు కూడా ఆ పార్టీలో లేరని, జగన్‌ను నమ్ముకుని ఉన్న వాళ్ళ రోడ్డు పడ్డారని.. అందుకు తానే ఉదాహరణ అని ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ అన్నారు. జగన్ మాటల్లో గుడ్ అనే పదం లేదని, మద్యపానం నిషేధం అమలు చేయలేదని.. పోలవరం కట్టలేదని.. ఇచ్చిన హామీలు అమలు చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలోనే వ్యతిరేకత వచ్చిందా..జగన్ అంటూ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం పాలన అద్భుతంగా ఉందని.. బుద్ధి ఉండే మాట్లాడుతున్నారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌ది ప్లాస్టిక్ నవ్వు అని... అన్న జగన్‌పై వైఎస్ షర్మిల చెప్పినవన్నీ నిజాలే అన్నారు. జగన్ చెప్పినట్లే ఎంపీ విజయసాయి రెడ్డి, ఎస్‌వి సుబ్బ రెడ్డి మాట్లాడుతున్నారని, వైసీపీ మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఎంతోమంది... వైసీపీని వీడడానికి రెడీగా ఉన్నారని, ముఖ్యమంత్రి చంద్ర బాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గేట్లు ఎత్తేస్తే.. వైసీపీలో జగన్ తప్ప అందరూ వచ్చేస్తారని అన్నారు. ఏయూ మాజీ విసీ ప్రసాద్ రెడ్డి ఒక దుర్మార్గుడని.. ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించార్నే. ప్రసాద్ రెడ్డి విషయంలో చట్టం తన పని చేసుకుంటుందని జనసేన ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్ అన్నారు.

# వైసిపి హయాంలో లిక్కర్ మాఫియా

అనకాపల్లి,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ హయాంలో లిక్కర్ మాఫియాపై మంత్రి కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు చేశారు. నాణ్యతలేని మద్యాన్ని సరఫరా చేసి ప్రజల ఆరోగ్యంతో ఆడుకున్నారన్నారు. మద్యం తయారీ కంపెనీ నుంచి అమ్మకాలు వరకు అవినీతి చేసి అడ్డంగా దోచుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కుటుంబంలో చెల్లెలి ఆస్తి దోచుకున్న దుర్మార్గుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని మండిపడ్డారు. ఇలాంటి వ్యక్తి సీఎంగా పనిచేయడం రాష్ట్ర ప్రజల దురదృష్టమన్నారు. వైసీపీ హయాంలో పెద్ద ఎత్తున లిక్కర్ మాఫియా జరిగిందని ఆరోపించారు. గతంలో జరిగిన లిక్కర్ మాఫియాపై సీఐడీతో విచారణ జరిపిస్తున్నామన్నారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధిలో అనకాపల్లి జిల్లాను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌పై మంత్రి విరుచుకుపడ్డారు. మాజీ కోడిగుడ్డు మంత్రి చేసిన అక్రమాలను వెలికితీసి, చర్యలు తీసుకుంటామని అన్నారు. సూపర్ సిక్స్ లో దశలవారీగా అన్ని పథకాలు అమలు చేస్తామని.. దీపావళికి గ్యాస్ సిలిండర్లు అందిస్తామన్నారు. నామినేటెడ్ పదవుల్లో కూటమి నాయకులకు తగిన ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు. వైసీపీ వాళ్ళ..రుషికొండకు గుండు కొట్టారని.. భూములు నొక్కేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకి అత్యంత ఇష్టమైన జిల్లా.. ఉమ్మడి విశాఖ జిల్లా అని తెలిపారు. అనకాపల్లి జిల్లాకు ఇన్‌చార్జ్ మంత్రిగా రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు సహా అన్ని హామీలను అమలు చేస్తామన్నారు. రాబోయే 20 సంవత్సరాల పాటు కూటమి అధికారంలో ఉండేలా పరిపాలన ఉంటుందన్నారు. రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉండే విధంగా ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తామన్నారు. అనకాపల్లిలో వంద పడకల ఎన్టీఆర్ వైద్యాలయాన్ని మల్టీ స్పెషాలిటీఆసుపత్రిగా తీర్చి దిద్దుతామని తెలిపారు. మత్స్యకారులు, బీసీ ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఃూగా.. ఈరోజు ఉదయం రాష్ట్ర ఎక్సైజ్, భూగర్భ గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అనకాపల్లి జిల్లాకు వచ్చారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి హోదాలో తొలిసారి అనకాపల్లి విచ్చేసిన మంత్రి రవీంద్రకు కూటమి నాయకులు భారీ స్వాగతం పలికారు. అనంతరం అనకాపల్లి టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి రవీంద్ర నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ , రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు సుందరపు విజయ్ కుమార్, కొణకాల రామకృష్ణ, కె ఎస్‌ఎన్ రాజు, పంచకర్ల రమేష్ బాబు , మాజీ మంత్రులు పప్పల చలపతిరావు, దాడి వీరభద్రరావు తదితరులు హాజరయ్యారు.

# రాష్ట్రంలో క్రెడిబిటిటీ ఉన్న పార్టీ కాంగ్రెస్

విజయవాడ,ఈ రాష్ట్రంలో క్రెడిబులిటి ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు.. జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి నాయకులతో ప్రత్యేక సమావేశాలు జరుగుతున్నాయని తెలిపారు. సోమవారం విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశాల్లో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... వైసీపీ, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో చేతులెత్తేసిందని ఆ పార్టీకు క్రెడిబులిటి లేదని ప్రజలకు అర్థమైందని అన్నారు. వైసీపీపై ప్రజలకు నమ్మకం పోయిందని విమర్శించారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి ఉన్న క్రెడిబులిటితో వారి సమస్యలపై అనునిత్యం పోరాటాలు చేయాలని, వారిలో భరోసా నింపే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామని అన్నారు. ప్రతి వారం రెండు సార్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి క్యాడర్‌లో నూతన ఉత్తేజం నింపాలని, కార్యవర్గానికి సూచించినట్లు షర్మిల వెల్లడించారు.మరోవైపు.. తన అన్న జగన్మోహన్‌రెడ్డిపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మళ్లీ విరుచుకుపడ్డారు. స్వప్రయోజనం కోసం తల్లిని కోర్టుకు ఈడ్చిన విషనాగుగా ఆయన్ను అభివర్ణించారు. తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానికి కారణమైన కాంగ్రెస్, చంద్రబాబుతో షర్మిల చేతులు కలిపారని.. జగన్ మళ్లీ సీఎం కాకూడదని ఆమె కంకణం కట్టుకున్నారని ఎంపీ విజయసాయిరెడ్డి ఆదివారం చేసిన వ్యాఖ్యలపై ఆమె 'ఎక్స్'లో మండిపడ్డారు. రాజశేఖర్‌రెడ్డి మరణానికి చంద్రబాబే కారణమైతే.. ఐదేళ్లు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గాడిదలు కాశారా అని ఆయన్ను నిలదీశారు. 'జగన్ ప్రత్యేక విచారణ ఎందుకు జరిపించలేదు? దర్యాప్తు చేసి నిజానిజాలు ఎందుకు బయటపెట్టలేదు? దోషులను ఎందుకు శిక్షించలేదు? అనుమానం ఉండి.. ఐదేళ్లు అధికారంలో ఉండి.. ఎందుకు ఒక్క ఎంక్వైరీ కూడా వేయలేదు? ఇది మీ చేతకానితనానికి నిదర్శనం కాదా' అని ధ్వజమెత్తారు. రాజశేఖర్‌రెడ్డి మరణానికి కాంగ్రెస్ ముమ్మాటికీ కారణం కాదన్నారు. కాంగ్రె?సను ఆయన రెండు సార్లు అధికారంలోకి తీసుకొచ్చారని.. బంగారు బాతును ఎవరూ చంపుకోరని.. సొంత కళ్లను ఎవరూ పొడుచుకోరని స్పష్టం చేశారు.

# కేసులు..అరెస్టులు..ఆస్తులు..గొడవలు



తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడంతా కేసులు, అరెస్టులు, ఆస్తుల గొడవలు, కోర్టు వివాదాలే కనిపిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చాలా మంది మంత్రులు అరెస్టు అవుతారని ప్రస్తుత తెలంగాణ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు బాంబుల పేలాయి. దానిమీద కేటీఆర్ కూడా స్పందించడం విశేషం. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య ఆస్తుల కోసం న్యాయవివాదం మొదలైంది. అన్నాచెల్లెళ్ల మధ్య ఆస్తుల పంపకాల గొడవలు ముదురుపాకాన పడ్డాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌కు మోదీ ప్రభుత్వం ఘనంగా ఇస్తున్నట్లు ప్రకటించిన అమరావతి రైల్వేలైన్ కూడా సింగిల్ లైనేనని తేలిపోవడంతో రాష్ట్ర ప్రజలు ఉసూరుమంటున్నారు. తెలుగు రాష్ట్రాల రాజకీయాలు సరికొత్త మలుపులు తిరుగుతున్నాయి. ఇంతకుముందు ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం అంటూ అప్పటి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేసి దాదాపు 50 రోజులకు పైగా జైల్లో పెట్టింది. తాజాగా తెలంగాణలోనూ ఈ తరహా వ్యవహారాలు మొదలయ్యేలా కనిపిస్తున్నాయి. గత సర్కారులో కీలక నేతలు నంబరు 1 నుంచి 8 వరకు అందరినీ అరెస్టు చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఒక్కసారిగా సంచలనం రేపాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అక్రమాలకు పాల్పడ్డారంటూ కొందరు నేతల విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించిన పొంగులేటి.. ఏకంగా సియోల్ పర్యటనలో సైతం దాని గురించి మాట్లాడారు. అక్రమాలకు పాల్పడిన వారందరి గురించి ఫైళ్లు రెడీ అయ్యాయని, దీపావళి టపాసులా ఏదో ఒక కుంభకోణం పేలుతుందని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల లోతు చూస్తే ఆయనేదో ఆషామాషీగా అన్నట్లు కనిపించడం లేదు. ఎందుకంటే.. అన్నింటికీ తమ దగ్గర పక్కా ఆధారాలున్నాయని, ఎవరినీ వదిలిపెట్టేది లేదని కచ్చితంగా చెబుతున్నారు. కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం (మొదట్లో టీఆర్ఎస్) పదేళ్ల పాటు చాలా బలంగానే కనిపించింది. తర్వాత కూడా అధికారంలోకి రావడం ఖాయమన్నట్లుగానే గులాబీ నేతలు గట్టిగా భావించారు. బహుశా అందుకేనేమో.. ఫోన్ ట్యాపింగ్, ధరణి, భూములకు సంబంధించిన పలు వ్యవహారాల్లో ఆ పార్టీ నేతలు ఒక రకంగా చెప్పాలంటే రెడ్ హ్యాండెడ్‌గానే దొరికిపోయారు. పైకి అధికారులే ప్రస్తుతానికి కనిపిస్తున్నా, వాటి వెనక నేతల హస్తం ఉందన్నది బహిరంగ రహస్యం. ఉన్నతస్థాయి నుంచి ఒత్తిళ్లు రాకుండానే పోలీసు అధికారులు తమంతట తాముగా ప్రతిపక్ష నాయకులు, సినిమా నటీనటులు, వ్యాపారులు.. ఇలా పలు వర్గాలకు చెందినవారి ఫోన్లు ట్యాపింగ్ చేయడం, అందుకోసం అత్యాధునిక పరికరాలను విదేశాల నుంచి తెప్పించడం ఎంతవరకు సాధ్యమన్నది అందరికీ తెలుసు. అయితే అనుకోని పరిస్థితుల్లో అనూహ్యంగా బీఆర్ఎస్ ఈసారి ఎన్నికల్లో మట్టికరిచింది. స్పష్టమైన మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. సాధారణంగా ప్రాంతీయ పార్టీల నేతలు, అందులోనూ ఒక ప్రత్యేక రాష్ట్రం కోసం కొట్లాడి, ఆ రాష్ట్రం సిద్ధించిన తర్వాత దానికి అధినేతలుగా అయినవారు కొంతమందిని చూస్తుంటే.. ఇలా వాళ్ల మీద ఏదో ఒక తరహా కేసులు రాక మానడం లేదు. ఈ అన్ని సందర్భాల్లోనూ చూసుకుంటే నిజంగానే వాళ్లు ఏవైనా అక్రమాలకు పాల్పడ్డారా.. లేదా కావాలనే అధికారంలోకి వచ్చిన జాతీయ పార్టీలు వాళ్ల మీద కక్ష సాధించడానికి ఇలా చేస్తున్నాయా అన్న అనుమానం రాక మానదు. ప్రాంతీయ పార్టీలకు గట్టి అభిమానులు ఉంటారు. ఒక వర్గంలో ఆయా పార్టీలకు అపారమైన బలం ఉంటుంది. అదే సమయంలో ప్రాంతీయ పార్టీలు కొత్త రాష్ట్రం తీసుకొచ్చినప్పుడు వాళ్ల మీద అంచనాలు కూడా చాలా ఎక్కువగానే ఉంటాయి. వాటిలో ఏ ఒక్కటి తీర్చలేకపోయినా.. ముందు ఎన్నికల్లో గెలవడానికి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చుకుపోయినా ఫలితాలు దారుణంగా ఉంటాయి. అప్పటివరకు పల్లకీలో మోసినవాళ్లే ఒక్కసారిగా పల్లకీని తిరగేసే ప్రమాదం లేకపోలేదు. ఇప్పుడు బీఆర్ఎస్ నేతల పరిస్థితి కూడా దాదాపు అలాగే తయారైంది. వాళ్ల మీద వస్తున్న ఆరోపణల్లో ప్రధానమైనది భూ ఆక్రమణలు, అక్రమ కొనుగోళ్లు. అధికారంలో ఉండగా దాదాపు ప్రతిచోటా కొత్తగా ఏదో ఒక అభివృద్ధి ప్రాజెక్టు పేరుతో వేల ఎకరాల భూములను బీఆర్ఎస్ నేతలు కారుచౌకగా ముందే కొనేసి పెట్టుకున్నారని, ఆ తర్వాతే అక్కడ ప్రాజెక్టులు ప్రకటించి వాటి రేట్లు పెంచుకున్నారన్న ఆరోపణలు గుప్పుమనేవి. అప్పటి మంత్రులు, వాళ్ల అనుచరులు కూడా పలు ప్రాంతాల్లో భూములు ఆక్రమించుకున్నారని చెబుతుంటారు. కుంభకోణాలు, అవినీతితో సంపాదించిన ఆస్తులను రికవరీ చేసేందుకు కూడా వెనకాడబోమని, ఆ విషయాన్ని చట్టమే చూసుకుంటుందని పొంగులేటి వ్యాఖ్యానిస్తున్నారంటే.. కేవలం అరెస్టులతోనే ఆగకపోవచ్చన్న సిగ్నల్ కనిపిస్తోంది. పాత్రికేయుల్లో కూడా చాలామంది బీఆర్ఎస్ నేతల తీరు విషయంలో గుర్రుగానే ఉన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్?? మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీకి వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిజాంపేట, పేట్ బషీరాబాద్ ప్రాంతాల్లో కలిపి 70 ఎకరాలు ఇచ్చారు. వాటిని ఆ సొసైటీ అప్పటి మార్కెట్ రేటు చెల్లించి మరీ కొనుగోలు చేసింది. అయితే, సంబంధిత జీఓ విడుదల చేయడంలో అందరికీ కలిపి ఒకే జీఓ ఇవ్వడంతో దానిపై న్యాయవివాదం మొదలైంది. ఎప్పుడో 2008లో ఒక్కొక్కరు అప్పులు చేసి మరీ రూ. 2 లక్షల చొప్పున కట్టినా, ఇప్పటికీ ఆ భూమి వారి చేతికి రాలేదు. సుప్రీంకోర్టు తీర్పు వస్తే వెంటనే ఇచ్చేస్తామని కేసీఆర్ ఒక సమయంలో ప్రకటించినా.. తర్వాత తీర్పు వచ్చినా ఏమాత్రం పట్టించుకోలేదు. అప్పట్లో నిజాంపేట స్థలంలో టవర్లు కట్టించి సొసైటీ సభ్యులందరికీ ఉచితంగా ఫ్లాట్లు ఇప్పిస్తామని, పేట్ బషీరాబాద్ సైట్ (38 ఎకరాలు) తమకు వదిలేయాలని బీఆర్ఎస్ వర్గాల నుంచి సొసైటీ నేతలకు ఫీలర్లు కూడా వదిలినట్లు అనధికారిక సమాచారం. అయితే, సభ్యులందరికీ సొంత ఇళ్ల కోసమే స్థలాలు రావాలన్న ఉద్దేశంతో సొసైటీ ఏర్పడినందున.. నాయకులు ఆ ప్రలోభాలకు, ఒత్తిళ్లకు తలొగ్గలేదు. ఎట్టకేలకు రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత కొంత వరకు మార్గం సుగమమైంది. ఇలా భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకుల మీద చాలా ఆరోపణలు వచ్చాయి. అందుకే రెవెన్యూ మంత్రి కూడా అయిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాస్త గట్టిగానే స్పందించారు. ధరణిభూముల అక్రమాలకు సంబంధించిన అంశాలనే వెలుగులోకి తెచ్చి కేసులు పెడతారని సమాచారం. ధరణి చట్టం వచ్చాక అనేక భూ లావాదేవీల్లో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వస్తున్న సంగతి తెలిసిందే. ఇదే అంశంలో సీఎంఎల్‌ఏ స్థాయిలో క్లియర్ చేయాల్సిన కొన్ని భూముల అంశాలను.. కలెక్టర్ల స్థాయిలోనే చేసేశారనే ఆరోపణలు ఉన్నాయి. ధరణి వ్యవహారాలను ఒక ప్రైవేటు సంస్థ తెరాసిస్కు ఇచ్చి, దాన్ని అడ్డుపెట్టుకుని కూడా కొన్ని లావాదేవీలు అక్రమంగా చేశారన్న సమాచారం ప్రభుత్వం వద్ద ఉన్నట్లు తెలుస్తోంది. వీటన్నింటి దృష్ట్యా తీవ్ర చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదని తెలుస్తోంది. అయితే.. పొంగులేటి వ్యాఖ్యల మీద కేటీఆర్ కూడా కాస్త గట్టిగానే స్పందించారు. నిజమైన బాంబులకే తాము భయపడలేదని.. ఏం చేస్తారో చేసుకోమని సవాల్ విసిరారు. చంద్రబాబు, వైఎస్సార్ వంటి వారితోనే పోరాటం చేశామని.. మీరో లెక్కా అంటూ విరుచుకుపడ్డారు. పొంగులేటి బాంబులు తుస్సే అంటూ వ్యాఖ్యానించారు. తాము ఒరిజినల్ బాంబులకే భయపడలేదన్నారు. అంతే కాదు.. పోలీసులను కూడా ఒక రకంగా కేటీఆర్ హెచ్చరించారు. అధికారులు జాగ్రత్తగా చూసుకుని పోవాలని, తేడా వస్తే మిత్తితో సహా అన్నీ తేలుస్తామని.. ఇప్పుడు అతిగా ప్రవర్తించే అధికారుల పేర్లన్నీ రాసి పెట్టుకుంటామని ఆయన వ్యాఖ్యానించారు. కేటీఆర్ వ్యాఖ్యలు చూస్తుంటే, సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ చేసిన వ్యాఖ్యలే గుర్తుకొస్తున్నాయి. అప్పట్లో లోకేశ్ ఒక ఎర్రటి అట్ట ఉన్న పుస్తకం చేతిలో పట్టుకుని.. రెడ్‌బుక్‌లో అందరి పేర్లూ రాస్తున్నామని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఎవరిని ఏం చేయాలో తమకు బాగా తెలుసని, రెడ్ బుక్ ఆధారంగానే చర్యలు ఉంటాయని హెచ్చరించేవారు. అందుకు తగినట్లుగా ఇప్పుడు జగన్ మోహన్ రెడ్డి కూడా రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని విమర్శిస్తున్నారు. కేటీఆర్ సైతం దాదాపు అదే గొంతు వినిపించడం విశేషం. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే, అక్కడ అధికార ప్రతిపక్షాల మధ్య కంటే, ప్రతిపక్షంలో ఒకే కుటుంబానికి చెందిన రెండు పార్టీల నేతల మధ్య యుద్ధం నడుస్తోంది. అది కూడా సొంత అన్నాచెల్లెళ్ల మధ్యే కావడం విశేషం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. గతంలో తాను ప్రేమాభిమానాలతో తన చెల్లెలు షర్మిలకు కొన్ని ఆస్తులు గిఫ్ట్? డీడ్ చేశానని, ఆ డీడ్ రద్దు చేసుకుంటానని కోర్టును ఆశ్రయించడం జాతీయ స్థాయిలో సంచలనాత్మకంగా మారింది. ఒక కంపెనీలోని వాటాల గురించి వైఎస్ జగన్, నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్‌లో వైఎస్ జగన్.. తనకు, తన సోదరి వైఎస్ షర్మిలకు మధ్య ఉన్న విభేదాల గురించి కూడా ప్రస్తావించారు. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో వాటాల బదిలీకి సంబంధించి ఎన్‌సీఎల్‌టీలో వైఎస్ జగన్, ఆయన భార్య వైఎస్ భారతి పిటిషన్ వేశారు. ఈ సంస్థలో తమ వాటాలను "అక్రమంగా" తన తల్లి వైఎస్ విజయమ్మ పేరు మీదకు బదిలీ చేశారని, ఆ షేర్ల బదిలీని రద్దు చేయాలని ఆ పిటిషన్‌లో కోరారు. సరస్వతి షేర్ల బదిలీకి సంబంధించి 2019 ఆగస్టు 31న ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆ ఒప్పందం ప్రకారం విజయమ్మను ట్రస్టీగా ఉంచి ఆ ట్రస్ట్? ద్వారా షర్మిలకు కంపెనీ షేర్లు భవిష్యత్తులో బదిలీ చేస్తారు. అది కూడా వైఎస్ జగన్, ఆయన భార్య భారతి సమ్మతి మేరకు నిర్ణయం తీసుకుంటారు. అందులో భాగంగా వైఎస్ జగన్, ఆయన భార్య భారతి కొన్ని ఈక్విటీ షేర్లను వైఎస్ విజయమ్మకు బహుమతిగా ఇచ్చారు. భవిష్యత్తులో కోర్టు అనుమతులు లభించాక జగన్, ఆయన భార్య అంగీకారం మేరకు షేర్లను బదిలీ చేయాలనే ఉద్దేశంతో ఆ షేర్లను బహుమతిగా ఇచ్చినట్లు పేర్కొన్నారు. అంటే ఆ గిఫ్ట్? డీడ్‌ను జగన్, భారతిల అనుమతి లేకుండా ఎగ్జిక్యూట్ చేయడానికి వీల్లేదు. కానీ, తమ అనుమతి లేకుండానే ఆ గిఫ్ట్? డీడ్‌ను ఎగ్జిక్యూట్ చేశారని పిటిషన్‌లో జగన్, ఆయన భార్య పేర్కొన్నారు. షర్మిల ప్రోద్బలంతోనే విజయమ్మ షేర్లు తన పేరుమీదకు బదిలీ చేయించుకున్నారని, షర్మిల ముందస్తు ఆలోచనతోనే ఉద్దేశపూర్వకంగానే అలా వ్యవహరించారని జగన్ దంపతులు భావించారు. షర్మిల అనుబంధం మరిచిపోయి వ్యక్తిగత దూషణలకు కూడా దిగారని, ఈ పరిస్థితుల నేపథ్యంలో ఆ వాటాలను తిరిగి తీసుకోవాలని భావిస్తున్నామని జగన్ తన పిటిషన్‌లో తెలిపారు. ఈ వ్యవహారం అంతా చూస్తే.. నిజానికి గిఫ్ట్? సెటిల్‌మెంట్ డీడ్ అనేది ఆస్తుల బదిలీలో ఒక పద్ధతి. సాధారణ వ్యక్తులైతే వీలునామా రాస్తారు. తండ్రి నుంచి పిల్లలకు దక్కాల్సిన ఆస్తిపాస్తుల వివరాలను ఎవరెవరికి ఎంతెంత వాటా ఇవ్వాలో ప్రస్తావిస్తూ వీలునామా సిద్ధం చేస్తారు. అయితే, ఈ వీలునామాను రాసినవాళ్లు తమ జీవితకాలంలో ఎప్పుడు కావాలంటే అప్పుడు మార్చుకోవచ్చు. అదే గిఫ్ట్? సెటిల్‌మెంట్ డీడ్ రాస్తే మాత్రం.. దాన్ని మార్చాలంటే తప్పనిసరిగా కోర్టుకు వెళ్లాలి. ఆ కోర్టు ఎవరి పేరుమీద అయితే గిఫ్ట్? డీడ్ ఉందో, వాళ్లను కూడా పిలిపిస్తుంది. ఎందుకు విషయాన్ని ఆస్తి అసలు యజమాని (తండ్రి లేదా వేరే ఎవరైనా) కోర్టుకు సమర్థంగా వివరించగలిగితే, కోర్టు ఆ వాదనతో సంతృప్తి చెందితే అప్పుడు ఆ గిఫ్ట్? డీడ్‌ను రద్దుచేస్తుంది. తన పిటిషన్‌లో "జగన్‌కు, షర్మిలకు మధ్య అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే ప్రేమ బంధం లేదు" అని పేర్కొనడం చర్చనీయాంశమైంది. "జగన్ పట్ల కృతజ్ఞత లేకపోవడమే కాదు, ఆయన మంచిని పట్టించుకోకుండా షర్మిల వ్యవహరిస్తున్నారు. బహిరంగంగా జగన్ మీద అనేక తప్పుడు ఆరోపణలు చేశారు. షర్మిల తీరు రాజకీయంగా జగన్‌ను వ్యతిరేకించడమే కాకుండా ఆయన గౌరవానికి భంగం కలిగేలా ఉంది. అందువల్ల అన్నాచెల్లెళ్ల మధ్య ఉండాల్సిన ప్రేమ, అభిమానం కరిగిపోయాయి" అని నేరుగా పిటిషన్‌లోనే రాశారు. దాంతోపాటు తామిద్దరి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లి, వాటిని సాక్ష్యాలుగా పరిగణనలోకి తీసుకోవాలని కోరడం సరికొత్త విషయం. దాన్ని కోర్టు కూడా పరిగణనలోకి తీసుకుంది. షర్మిల వైఎస్సార్ తెలంగాణ పార్టీ పెట్టినప్పుడు జగన్ దాని గురించి ఏమీ స్పందించలేదు. ఆ తర్వాత 2024 అసెంబ్లీ ఎన్నికల ముందు ఆమె తన పార్టీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయడంతో పాటు.. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. అప్పట్నుంచి తన అన్న జగన్ మీద నేరుగా విమర్శలు చేయడం ప్రారంభించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు గురించి ప్రస్తావిస్తూ, ఆయన కుమార్తె సునీతను వెంట పెట్టుకుని వివేకా హత్యకు జగనే కారకుడంటూ ఘాటు విమర్శలకు దిగారు.

## వెలుగొండ ప్రాజెక్టుకు శాపం

ప్రకాశం జిల్లా,2014-19లో గత తెలుగుదేశం పాలనలో వెలుగొండ ప్రాజెక్టుకు రూ. 1373 కోట్లు కేటాయించి,1319 కోట్లు ఖర్చు చేశామని, గత అయిదేళ్ళ జగన్ పాలనలో రూ. 3,518 కోట్ల బడ్జెట్ కేటాయించి, కేవలం రూ.170 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. మంగళవారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. జగన్ పాలన వెలిగొండ ప్రాజెక్టుకు శాపంగా మారిందని, టన్నెల్స్, ఫీడర్ కెనాల్, రిజర్వాయర్ పనులు, నిర్వాసితులకు 880 కోట్ల రూపాయలు ఇవ్వాల్సి ఉండగా, ఒక రూపాయి కూడా జగన్ ఇవ్వలేదని మండిపడ్డారు. ఎన్నికల ముందు వెలుగొండ జాతికి అంకితం అనడం, జగన్ మార్క్ మోసం.. దగా అని దుయ్యబట్టారు. నిర్వాసితులను హౌస్ అరెస్ట్ చేసి జగన్ వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించారని, రెండో టన్నెల్‌లో తవ్విన రెండు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని మొదటి టన్నెల్ చివర భాగాన పోశారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రెండో టన్నెల్ 12వ కిలో మీటర్ దగ్గర మూడేళ్ళ క్రితమే టన్నెల్ బోరింగ్ మెషిన్ పాడై ఉంటే దానిని ఎందుకు బయటకు తీయలేకపోయారని ప్రశ్నించారు. ఏ ప్రాజెక్టుకు వెళ్ళినా జగన్ విధ్వంసమే కనిపిస్తోందన్నారు. కాగా రెండు దశల్లో వెలుగొండ ప్రాజెక్టును వెనువెంటనే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. ఫేజ్-1లో హెడ్ వర్క్స్, రెండు టన్నెల్స్, ఫీడర్ ఛానెల్, రిజర్వాయర్, రెగ్యులేటర్ వంటి నిలిచిపోయిన పనులు పూర్తి చేసి వచ్చే సీజన్ నాటికి 1.19 లక్షల ఎకరాలకు నీళ్ళు అందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.


మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.. వెలిగొండ పూర్తయితే నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, తాను అధికారంలోకి వస్తే ఏడాదిలోగా వెలిగొండ పూర్తి చేస్తానన్న జగన్ ఐదేళ్లపాటు ఏం చేశారని ప్రశ్నించారు. ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండా, పరిహారం ఇవ్వకుండా ప్రారంభోత్సవం చేసి జిల్లా ప్రజల్ని జగన్ మోసం చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 2014 -19 లోనే మెజార్టీ పనులు పూర్తి చేశామని, జగన్ అధికారంలోకి వచ్చాక ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయని విమర్శించారు. 'వెలిగొండ ప్రారంభించింది సీఎం చంద్రబాబు నాయుడే.. పూర్తి చేసేది చంద్రబాబు నాయుడే' అని అన్నారు. త్వరితగతిన వెలిగొండ పూర్తిచేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని, ప్రకాశం జిల్లా అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు.

## పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన పొన్నం

సిద్దిపేట,సన్న వడ్లకు ఈ సీజన్ నుంచే రూ. 500 బోనస్ ఇస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. పత్తి, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందికి గురి చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు తూకం పేరిట రైతులను మోసం చేసే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నవంబర్, డిసెంబర్ లోపు రూ. 2లక్షల లోపు రైతుల అందరికి రుణమాఫీ జరుగుతుందన్నారు మంత్రి పొన్నం. రూ 2 లక్షల పైన ఉన్న రైతుల కోసం కూడా

# డిజిటల్ అరెస్టులు ..పారాహుషార్..!

హైదరాబాద్,డిజిటల్ అరెస్ట్..ఇప్పుడీ భయం ప్రపంచాన్ని వణికిస్తోంది. కరోనాను మించి భూతంలా వెన్నాడుతోంది. అనేకులు మోసపోతున్నారు. బెదరించి..బ్లాక్ మెయిల్ చేయడం ద్వారా ఖాతాలను కొల్లగొట్టేస్తున్నారు. ఇలాంటి ఫేక కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి. మోసం చేస్తున్నాడని గుర్తించి పోలీసులను అప్రమత్తం చేయాలి. ఓ రకంగగా ఇలాంటి కాల్స్ వస్తే తిరస్కరించడమే మేలు. డిజిటల్ అరెస్టల క్రమంలో భారత్ అప్రమత్తం అయ్యింది. బాధితులు హేతుబద్ధంగా ఆలోచించే వ్యవధి ఇవ్వరాదనే సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టు, తక్షణం స్పందించకపోతే చట్టపరమైన చర్యలు వంటి మాటలతో భయపెట్టాలని చూస్తున్నారు. దేశీయంగా ప్రభుత్వ ఏజెన్సీలు అధికారిక లావాదేవీలకు వాట్సప్ లేదా స్కైప్ వంటి వేదికలను ఉపయోగించవు. ఎవరైనా ఫోన్‌కాల్ లేదా ఈమెయిల్ ద్వారా సంప్రదించి.. మీ చట్టవ్యతిరేక కార్యకలాపాలపై దర్యాప్తు చేస్తున్నామని చెబితే బెంబేలు పడిపోకుండా అవతలి వ్యక్తులతో మాట్లాడి వారి గుర్తింపును ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. మోసగాళ్లు మిమ్మల్ని మభ్యపెట్టి బ్యాంకు ఖాతాల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు బదిలీ చేయాలని ఒత్తిడి తెస్తారు. ఇటువంటి సందర్భాల్లో మన భయం వారి పని సులువు చేస్తున్నదనే విషయాన్ని గుర్తించాలి. చట్టబద్ధమైన ఏజెన్సీలు ఏవీ తక్షణం డబ్బు పంపాలని ఒత్తిడి తీసుకురావు. సైబర్ నేరాలకు స్పందించే ముందు ఒక క్షణం ప్రశాంతంగా ఆలోచించాలి. తెలియని నంబర్లకు ఫోను ద్వారా, వీడియోకాల్స్ ద్వారా వ్యక్తిగత సమాచారం, ఆర్థికపరమైన వివరాలు ఇవ్వరాదు. పెరుగుతున్న సైబర్ నేరాల నుంచి రక్షించుకోవాలంటే మరింత జాగ్రత్తగా, ఎప్పటికప్పుడు ఇటువంటి పరిణామాలు తెలుసుకొంటూ ఉండటం అవసరం. ఒక్కోసారి చట్టబద్ధమైన సంస్థల లోగోలు కూడా మోసగాళ్లు వాడుతుంటారు. లాటరీ తగిలిందనే సందేశాలు వచ్చినపుడు గుడ్డిగా నమ్మడం, దురాశకు పోవడం చేస్తే సులువుగా దోచేస్తారు. వైద్య చికిత్సల కోసమని, ఫేక్ ఛారిటీ అప్పీళ్లతో భావోద్వేగాలను బలహీనతగా వాడుకునే కుంభకోణాలు, చట్టబద్ధమైన హైరింగ్ పోర్టల్స్ లేదా సామాజిక మాధ్యమాల్లో నకిలీ ఉపాధి పోస్టులు పెట్టి నిరుద్యోగులను మోసగించే వైనాలు కూడా ఉంటున్నాయి. వినియోగదారులకు సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం ఆసరాగా చేసుకొని వైరస్ గురించి హెచ్చరించడం ద్వారా రహస్యంగా కంప్యూటర్‌ను యాక్సెస్ చేసి సున్నితమైన వ్యక్తిగత సమాచారం అపహరిస్తారు. త్వరగా డబ్బు సంపాదించాలనే బలహీనతను ఆసరాగా చేసుకొని పెట్టుబడి కుంభకోణాలు, ఫేక్ ఆన్‌లైన్ స్టోర్లతో క్యాష్ ఆన్ డెలివరీ మోసాలు కూడా పెరుగుతున్నాయి. పొరపాటున మన ఖాతాకు పంపిన డబ్బు వెనక్కు ఇవ్వాలని కోరడం.. ఓటీపీలు అడగటం.. డ్రగ్స్ పార్శిళ్లు వచ్చాయనే బెదిరింపులు, తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వజూపటం వంటి ఎత్తుగడల్లో సైబర్ నేరగాళ్లు నైపుణ్యం సాధించారు. దేశంలో ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో డజనుకు పైగా సూచనలతో ప్రజలను అప్రమత్తం చేస్తూ సీఈఆర్‌టీ-ఐఎన్' కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీం ఆఫ్ ఇండియా అత్యవసర పబ్లిక్ అడ్వయిజరీని జారీ చేసింది. భారత సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ విడుదల చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్ర



మోదీ సైతం 'మన్ కీ బాత్'లో సైబర్ నేరాల గురించి ప్రజలను హెచ్చరించారు. అసలు 'డిజిటల్ అరెస్టు' అన్నదే పెద్ద ఆన్‌లైన్ కుంభకోణమని సీఈఆర్‌టీ-ఐఎన్ తెలిపింది. నిజానికి ఇలా వారు ప్రయోగించే ఒత్తిడి వ్యూహాలకు లొంగరాదని సీఈఆర్‌టీ-ఐఎన్ తన అడ్వయిజరీలో ప్రజలను కోరింది. 'డిజిటల్ అరెస్టు'ల పేరిట ఆన్‌లైన్‌లో జరుగుతున్న మోసాలను ప్రధాని మోదీ ఏకంగా మన్‌కీబాత్‌లో ప్రస్తావించి.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించడంతో అందరి దృష్టి వీటిపై పడింది. ఇటీవల వీటికి సంబంధించిన కీలక సమాచారాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ వెల్లడించింది. దేశంలో చోటుచేసుకొంటున్న డిజిటల్ అరెస్టులు, ట్రేడింగ్, రొమాన్స్ స్కామ్‌లు, ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో దాదాపు 46శాతం మూడు దేశాల నుంచే జరుగుతున్నట్లు గుర్తించారు. వాటిల్లో పొరుగున్న మయన్మార్, లావోస్, కంబోడియా కేంద్రంగా ఈ ముఠాలు రెచ్చిపోతున్నాయని వెల్లడించింది. ఇప్పటివరకు మొత్తంగా బాధితులు దాదాపు రూ.1,776 కోట్లు నష్టపోయారని గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటిమోసపూరిత కాల్స్..బెదిరింపులపై ఎప్పటికప్పుడు అప్రమత్తం కావాలి. ప్రజలు ఒక్క క్షణం ఆలోచించి అడుగువేస్తే డిజిటల్ అరెస్టుల మోసం నుంచి రక్షణ పొందవచ్చు. నిజానికి డిజిటల్ మోసాలపై ఆందోళన చెందవద్దు. అప్రమత్తతతో ఉంటే చాలని గుర్తించాలి. నిజానికి మోసగాళ్లు ప్రజల వ్యక్తిగత వివరాలు సేకరించి, ఆ తర్వాత భయపెడతారు. మనకే ఆశ్చర్యం కలిగించేలా మీ సమాచారాన్ని సేకరిస్తారు. ఆ తర్వాత తమ ఆహార్యంతో ప్రభుత్వ కార్యాలయంలో ఉన్నామనే భ్రమ కల్పిస్తారు. వారెంతగా మిమ్మల్ని భయపెడతారంటే.. మనకుకు ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వరు. ఇప్పటికిప్పుడు తాము చెప్పినట్లు చేయకపోతే అరెస్టు తప్పదని మానసిక ఒత్తిడి తెస్తారు. దీంతో కొందరు భయంతో కష్టార్జితం మొత్తాన్ని వారికి కట్టబెడుతున్నారు. అందుకే అప్రమత్తంగగా ఉండాలి. ఒకవేళ నేరగాళ్ల నుంచి ఫోన్‌కాల్స్ వస్తే బెదిరిపోవద్దు. వీలైతే స్క్రీన్‌షాట్ తీసి, కాల్‌ను రికార్డు చేయాలి. డిజిటల్ అరెస్టు అనేది మన చట్టాల్లో లేదు. అది ముమ్మాటికీ మోసం, వంచన, అబద్ధం. ఇలాంటి పనులు చేస్తున్నవారు సమాజానికి శత్రువులు అనే గుర్తించాలి. కాల్ చేసిన వారి గురించి అస్సలు పట్టించుకోవద్దు. ఎలాంటి బెదిరింపులు, ప్రలోభాలకు లొంగగవద్దు. సాధ్యమైనంత వరకు కాల్స్ కట్ చేయాలి. బెదిరింపులకు పాల్పడే వారిని గుర్తించి ఫిర్యాదు చేయాలి. అంతేగాకుండా మన తోటివారితో చర్చించాలి.

## మళ్లీ టిడిపి గూడికి బాబూమోహన్

హైదరాబాద్,తెలంగాణకు చెందిన సీనియర్ నేత, నటుడు బాబుమోహన్ కేఏపాల్ కు షాక్ ఇచ్చారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్నట్లు సోషల్ మీడియాలో వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్ నియోజకవర్గంలో మెంబర్ షిప్ తీసుకున్న ఫోటోను ఆయన విడుదల చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీజేపీని వీడి ప్రజాశాంతి పార్టీలో చేరిన ఆయన మళ్లీ కొన్ని రోజుల గడవక ముందే ప్రజాశాంతి పార్టీకి దూరంగా ఉన్నారు . 2024 ఆగస్టులో టీడీపీ అధినేత చంద్రబాబును బాబు మోహన్ కలిశారు. లేటెస్ట్ గా పార్టీ సభ్యత్వం తీసుకున్నట్లు ప్రకటించారు. బాబు మోహన్ 1999లో ఉమ్మడి మెదక్ జిల్లా ఆందోళ్ నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రిగా పనిచేశారు. మళ్లీ 2004, 2014లో కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహపై గెలిచారు. 2018లో బీఆర్ఎస్ నుంచి టికెట్ రాకపోవడంతో బీజేపీలో చేరి.. బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్ చేతిలో ఓడిపోయారు. 2023లో బీజేపీ నుంచి పోటీ చేసి దామోదర రాజనర్సింహ చేతిలో ఓడిపోయారు. లోక్ సభ ఎన్నికలకు ముందు 2024 ఫిబ్రవరి 7న బాబు మోహన్ బీజేపీకి రాజీనామా చేశారు. కిషన్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేసి పార్టీకి గుడ్ బై చెప్పారు. మార్చి 4న ప్రజాశాంతి పార్టీలో చేరారు. మళ్లీ లేటెస్ట్ గా టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు.

## విమాన టిక్కెట్ల పేరుతో దోపిడీ

న్యూఢిల్లీ,విమాన టికెట్ల ధరలపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఫైర్ అయ్యారు. టికెట్ ధరలకు సంబంధించి కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు నారాయణ లేఖ రాశారు. విమాన ప్రయాణికులను విమాన సంస్థలు దోచుకుంటున్నాయని మండిపడ్డారు. మౌలిక సదుపాయాలు ప్రభుత్వం కలిపిస్తే ప్రైవేట్ విమానయాన సంస్థలు అడ్డగోలుగా టికెట్ రేట్లు పెంచుతున్నాయని వ్యాఖ్యలు చేశారు. ప్రయాణ దూరం మారనప్పుడు టికెట్ ధరలు ఎలా పెంచుతారని ప్రశ్నించారు. ప్రజలను లూటీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంటలిజెన్స్ విభాగం ఏం చేస్తోంది....

భారత్ దేశ నేపథ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ఫ్లైట్ టికెట్ ధరలు నిర్ణయించాలని సూచించారు. విమానయాన టికెట్ల రేట్లపై నియంత్రణ ఉండాలన్నారు. విమానయాన శాఖ ప్రజల కోసం పని చేయాలన్నారు. విమానయాన టికెట్ల ధరలు ప్రజలకు అనుకూలంగా ఉండాలని వెల్లడించారు. కార్పొరేట్ వ్యక్తులే కాదు సామాన్య, మధ్య తరగతి ప్రజలు కూడా విమానాల్లో ప్రయాణిస్తున్నారని తెలిపారు. విమానయాన సంస్థలకు బాంబు బెదిరింపులు వస్తుంటే ఇంటలిజెన్స్ విభాగం ఏం చేస్తోందని ప్రశ్నించారు. సైకలాజికల్ టెర్రర్‌కు గురి చేస్తున్నారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఉగ్ర మూకలు రెచ్చిపోతున్నాయన్నారు. విమానాలకు బాంబు బెదిరింపులు రావడం ఇంటెలిజెన్స్ వైఫల్యమంటూ విరుచుకుపడ్డారు. విమానయాన సంస్థలు టికెట్లు ధరలను నియంత్రించకపోతే అది కేంద్ర ప్రభుత్వ వైఫల్యం అవుతుందన్నారు.

# ఫ్యూచర్ సిటీకి వేగంగా కసరత్తు..



హైదరాబాద్, ఫ్యూటర్ సిటీ పనులకు వేగంగా అడుగులు పడుతున్నాయి. భూసేకరణ,రహదారుల నిర్మణానికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. అలాగే అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన హంగులతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని నిర్మాణానికి మెగా సంస్థ ముందుకు వచ్చింది. ఈ క్రమంలో సిఎం రేవంత్ సమక్షంలో ఒప్పందం కూడా జరిగింది. ఈ క్రమంలో ఇక పనులు కూడా వేగం పుంజుకోనున్నాయి. సిఎం రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా దీనిని రూపొందించారు. అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. మెగా కంపెనీ రావడంతో నిర్మాణాలకు సంబంధించి పలు నమూనాలను సర్కారు తయారు చేయించింది. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో యూనివర్సిటీ క్యాంపస్‌ను దేశంలో అందరి దృష్టిని ఆకర్షించేలా నిర్మించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాజాగా ఆర్కిటెక్ట్ ఇంజినీర్లకు, నిర్మాణ బాధ్యతలు చేపట్టిన మేఘా కంపెనీ ప్రతినిధులకు సూచించారు. నవంబరు 6వ తేదీన పనులు ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఎనిమిది నుంచి పది నెలల్లోగా ఈ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణానికి మేఘా కంపెనీ ఇటీవలే రూ.200 కోట్ల విరాళం అందించింది. అదానీ కంపెనీ సైతం రూ.100 కోట్ల విరాళం అందజేసింది. వీటితోపాటు వివిధ కార్పొరేట్ కంపెనీల భాగస్వామ్యం, విరాళాల ద్వారా సమీకరించిన నిధులతో కార్పస్ ఫండ్‌ను ప్రభుత్వం జమ చేస్తోంది. వీటితో యూనివర్సిటీ నిర్వహణకు భవిష్యత్తులో ఆర్థికపరమైన ఇబ్బంది తలెత్తకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేట సమీపంలో దాదాపు 57 ఎకరాల విస్తీర్ణంలోని యూనివర్సిటీ స్థలంలో అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌తోపాటు.. అకడమిక్ బ్లాక్, వర్క్ షాప్‌లు, బాలికలు, బాలురకు వేర్వేరుగా వసతి గృహాలు, డైనింగ్ హాల్, స్టాఫ్ క్వార్టర్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. వీటితోపాటు ఆడిటోరియం, లైబ్రరీ, సువిశాల మైదానం, పార్కింగ్ ఏరియా ఉండేలా ఈ డిజైన్లు రూపొందించారు. సువిశాల ప్రాంగణంలో ఎక్కువ ఖాళీ స్థలం, పచ్చదనం ఉండేలా నమూనాలు తయారు చేయించారు. ఆరు వేల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, వసతి సదుపాయాలు ఉండేలా క్యాంపస్‌లో నిర్మాణాలను చేపట్టనుంది. అన్ని భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్లను అమర్చనున్నారు.వీటితోపాటు విద్యుత్తు వినియోగం తగ్గించేలా.. ఏసీల వాడకం లేకుండా కొన్ని భవనాల్లో గాలి, వెలుతురు ఉండేలా అధునాతన డిజైన్లు రూపొందించారు. స్కిల్స్ యూనివర్సిటీకి శంషాబాద్ విమానాశ్రయంతోపాటు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి సులభంగా చేరుకునేందుకు వీలుగా కొత్త రహదారి నిర్మించాలని టీజీఐఐసీ, హెచ్ఎండీఏ, రహదారులు భవనాల శాఖల అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) ఎగ్జిట్ 13 రావిర్యాల నుంచి కొంగరకలాన్ మీదుగా మీర్‌ఖాన్‌పేట్.. అక్కడి నుంచి ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి వద్ద రీజనల్ రింగ్‌రోడ్‌ని అనుసంధానం చేస్తూ 40 కిలోమీటర్ల రహదారిని అందుబాటులోకి తీసుకుని రానున్నారు. ఈ రహదారిని ఓఆర్ఆర్‌లా 200 అడుగుల వెడల్పుతో నిర్మించనున్నారు. రావిర్యాల నుంచి ఆకుతోటపల్లి వరకూ ఉన్న మార్గంలో కొన్ని గ్రామాల నుంచి ఈ రహదారి వెళ్లనుండగా.. భూసేకరణపై రెవెన్యూ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తంగా ఫ్యూటచర్ సిటీలో ఈ వర్సిటీ కీలకం కానుంది.

# దీపావళి వేడుకలకు ముస్తాబవుతున్న అయోధ్య

లక్నో, దీపావళి వేడుకలకు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరం ముస్తాబవుతోంది. ఒకేసారి లక్షలాది దీపాలు వెలిగించి ప్రపంచ రికార్డు సృష్టించేందుకు సిద్ధమైంది. ఏటా దీపావళి పర్వదినానికి ముందు రోజు అయోధ్యలోని సరయూ నదీ తీరంలో 'దీపోత్సవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగానే గతేడాది ఏకంగా 25 లక్షల దీపాలు ఒకేసారి వెలిగించి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించింది. అయితే ఈ ఏడాది 28 లక్షల దీపాలతో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాలని యూపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగానే అక్టోబర్ 30న జరిగే దీపోత్సవ్ వేడుకలకు అయోధ్యా నగరి ముస్తాబవుతోంది. సరయూ నదీ తీరంలో దీపోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 51 ఘాట్‌లలో ఒకేసారి 28 లక్షల దీపాలు వెలిగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 30 వేల మంది వాలంటీర్లు ఈ దీపోత్సవం కార్యక్రమంలో భాగం కానున్నారు. ఇక రామ మందిరం నిర్మాణం తర్వాత తొలి సారి జరుగుతున్న దీపావళి పండుగ కావడంతో ఈ దీపోత్సవాన్ని మరింత అద్భుతంగా నిర్వహించాలని యూపీ సర్కార్ భావిస్తోంది. ఇందులో భాగంగానే రామ మందిర సముదాయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. బుధవారం సాయంత్రం



6:30 గంటలకు యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్.. సరయూ హారతి ఇస్తారు. అనంతరం నది ఒడ్డున దీపోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ కార్యక్రమాన్ని మొత్తం డ్రోన్ కెమెరాలతో చిత్రీకరిస్తూ దీపాలను లెక్కించనున్నారు. ఈ దీపోత్సవానికి అన్ని శాఖల మంత్రులు, ప్రభుత్వ అధికారులు హాజరుకానున్నారు. కార్యక్రమం అనంతరం లేజర్ షో ఏర్పాటు చేశారు.

# రైల్వే ప్రయాణికులకు ఇండియన్ రైల్వేస్ గుడ్‌న్యూస్

ఢాకా, దీపావళి పండగకు ముందు రైల్వే ప్రయాణీకులకు ఇండియన్ రైల్వేస్ గుడ్‌న్యూస్ చెప్పింది. దీపావళి పండుగ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో 200 కొత్త రైళ్లను ప్రకటించింది. పండగ వేళ దేశవ్యాప్తంగా ప్రజలు తమ స్వస్థలాలకు వెళ్తుంటారు. ఈ సమయంలో ఉండే రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వేస్ ఈ కీలక ప్రకటన చేసింది. ప్రయాణీకులను సురక్షితంగా, సకాలంలో వారి గమ్య స్థానాలకు చేర్చేందుకు ఈ రైళ్లను ప్రవేశపెట్టింది. దేశంలోని అన్ని ప్రాంతాలకు ఈ ట్రైన్స్ నడపనున్నట్టు పేర్కొంది. న్యూఢిల్లీ, పాట్నా, అహ్మదాబాద్, లక్నో, రోహ్‌తక్, పూణే, ముంబైతో పాటు ఇతర ప్రధాన స్టేషన్లను అనుసంధానిస్తూ ఈ సర్వీసులను నడపనున్నట్టు పేర్కొంది. ఈ కొత్త రైళ్లకు తోడు పండుగ సీజన్‌లో మరింత మంది ప్రయాణీకుల సౌకర్యార్థం అక్టోబర్ 29, 30 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు పేర్కొంది. రైళ్లకు సంబంధించిన సమాచారాన్ని ఎక్స్ ద్వారా వెల్లడించింది.

7000 ప్రత్యేక రైళ్లు

దీపావళి, ఛత్ పూజ సమయంలో ప్రయాణీకుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ సంవత్సరం 7,000 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ రైళ్ల ద్వారా రోజుకు అదనంగా రెండు లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. దీపావళి నేపథ్యంలో స్టేషన్లలో రద్దీని




నియంత్రించేందుకు గత ఆదివారం ఇండియన్ రైల్వేస్ కీలక ప్రకటన చేసింది. ముంబైలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, దాదర్, లోకమాన్య తిలక్ టెర్మినస్, థానే, కళ్యాణ్, పూణే, నాగ్‌పూర్‌తో సహా ఎంపిక చేసిన ప్రధాన స్టేషన్లలో ప్లాట్‌ఫారమ్ టిక్కెట్ల అమ్మకాలపై తాత్కాలిక ఆంక్షలు విధించింది. దీంతో ప్లాట్‌ఫామ్ టికెట్లను పరిమిత సంఖ్యలోనే విక్రయించనున్నారు. ఆదివారం ఉదయం ముంబైలోని బాంద్రా రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట నేపథ్యంలో రైల్వేస్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ తొక్కిసలాట ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు.

# వైసీపీ స్లాట్ లోకి జనసేన ?



అమరావతి,రాజకీయాల్లో శూన్యత అన్నది ఒక్కోసారి ఉంటుంది. మరి కొన్ని సార్లు చేసుకోవాల్సి వస్తుంది. ఇపుడు ఏపీలో అదే పని జరుగుతోందా అంటే జనసేన అధినాయకత్వం ఆలోచనలు చూసూంటే అదే అవును అనిపించేలా ఉంది. ఏపీలో వైసీపీ ఓటమి పాలు అయ్యాక బాగా వీక్ అవుతోంది. ఆ పార్టీలోని నేతలు అంతా కూటమి వైపుగా సాగుతున్నారు. కొందరు టీడీపీని ఎంచుకుంటే మరికొందరు జనసేన వైపు వస్తున్నారు. ఇక వైసీపీలో ఉన్న వారిలో అత్యధికులు పార్టీలో ఉన్నారా లేదా అన్నట్లుగా ఉన్నారు.వైసీపీలో జగన్ కి పార్టీ నేతల నిర్లిప్తత కొంత ఇబ్బందిని పెడుతోంది. పార్టీని పుంజుకునేలా చేయాలని ఎంత చూసినా నేతల నుంచి తగినంత స్పందన రావడం లేదు. మరో వైపు చూస్తే టీడీపీ కూటమి ఎత్తుకు పై ఎత్తు వేస్తూ వైసీపీని చిత్తు చేస్తోందిటీడీపీ జనసేన రెండూ వైసీపీని టార్గెట్ చేస్తున్నాయి. ఎక్కడ వీలైతే అక్కడ వైసీపీని దెబ్బ తీయడానికి కాచుకుని కూర్చున్నాయి. జనసేన అయితే కొత్తగా నాయకత్వాన్ని నిర్మించుకోవాలని మొదట భావించింది. కానీ ఇపుడు మాత్రం ఆలోచనలు మారాయని అంటున్నారు. అలాగే ఆట తీరు మార్చింది అని అంటున్నారు.వైసీపీ నుంచి వచ్చే బిగ్ షాట్స్ కి ఘన స్వాగతం పలకడమే కాకుండా డోర్స్ ఓపెన్ చేసింది. ఎందుకంటే పార్టీ నాయకత్వాన్ని ఎక్కడికక్కడ బలోపేతం చేయడం మంచిదే కానీ అది లాంగ్ టెర్మ్ ప్రాసెస్. అదే టైం లో వైసీపీ ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉంది. ఒక విధంగా చెప్పాలీ అంటే సంక్షోభంలో ఉంది.దానికి క్యాష్ చేసుకోవడమే రాజకీయంగా ఉత్తమం అని జనసేన భావిస్తోంది. వైసీపీకి ఏ మాత్రం చాన్స్ ఇచ్చినా మళ్ళీ బలంగా మారుతుందని అది జనసేన భవిష్యత్తు అలాగే పార్టీ విస్తరణకు అడ్డంకిగా మారుతుందని భావించే చాలా మందిని వరసబెట్టి చేర్చుకుంటున్నారు అని అంటున్నారు.ఇప్పటికే కొందరు మాజీ ఎమ్మెల్యేలను మాజీ మంత్రులను జనసేన చేర్చుకుంది. నిజానికి అది జనసేన అధినాయకత్వం పాలసీయే కాదు, కానీ రాజకీయ అనివార్యతే అలా వ్యూహాలు మార్చేలా చేసింది అని అంటున్నారు.ఇక మీదట కూడా మరింత మందిని వైసీపీ నుంచి ఆకర్షించే కార్యక్రమానికి జనసేన తెర తీస్తోందని అంటున్నారు. జనసేనలో చేరడం వల్ల ఆ పార్టీ నేతలకు కూడా లాభంగానే ఉంది అని అంటున్నారు. అక్కడ పోటీ నాయకత్వం లేకపోవడం ఒక రకమైన అడ్వాంటేజ్ అయితే రేపటి రోజున కూటమిలో అధికారం పంచుకునే చాన్స్ కూడా దక్కుతుంది అన్నది మరో అడ్వాంటేజ్.ఇలా ఉభయకుశలోపరిగా ఈ చేరికలు ఉంటున్నాయి. ఏపీలో వైసీపీని బాగా తగ్గించాలన్నది నిన్నటి దాకా టీడీపీ ప్లాన్ అయితే దానికి జనసేన కూడా జత కలుస్తోంది. ఎందుకు అంటే వైసీపీ ఎంత బలహీనం అయితే అంతలా ఎదిగే పార్టీ ఏపీలో జనసేన మాత్రమే అని అంటున్నారు.ఏపీలో ఎటూ టీడీపీ బలంగా ఉంది. దానితో ఢీ కొట్టే పార్టీగా వైసీపీ ఉండాల్సింది. అయితే రాజకీయంగా కొన్ని సమస్యలు ఆ పార్టీని వెంటాడుతున్నాయి. దాంతో వైసీపీని వీక్ చేస్తే ఆ పొలిటికల్ స్లాట్ లోకి సులువుగా వెళ్లవచ్చు అన్నదే జనసేన ఎత్తుగడగా చెబుతున్నారు. దాంతో రానున్న రోజులలో ఏపీలో అనేక సంచలన పరిణామాలు చోటు చేసుకునే వీలు ఉందని అంటున్నారు.

# ఆందోళనకరంగా ఢిల్లీ వాతావరణ కాలుష్యం



న్యూఢిల్లీ, శిలాజ ఇంధనాల పెరుగుదలతో ప్రపంచానికి పెనుముప్పు తప్పదని ఓ నివేదిక తేల్చింది. బొగ్గు, చమురు, గ్యాస్ వంటి శిలాజ ఇంధనాలను విపరీతంగా వాడుతుండటంతో.. గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోతుందని.. దీంతో లక్షలాది మందిప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొంది. దీనికి సంబంధించిన విపరీత పరిణామాల కారణంగా అనేక రకాల నష్టాలరు చవిచూస్తున్నాం. భవిష్యత్తులో మరింత తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని ఆ నివేదిక హెచ్చరించింది. ఒక్క భారత్‌లోనే 2 నిమిషాలకు ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారని ఓ నివేదిక ఇప్పటికే వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ వాతావరణ సంస్థ వంటి పలు సంస్థలకు చెందిన నిపుణులు ఈ నివేదనకు రూపొందించారు. ఈ శతాబ్దం చివరి నాటికి గ్లోబల్ వార్మింగ్ 2.7 డిగ్రీల సెల్సియస్ పెరగనుందని నివేదిక తెలిపింది. ఈ శిలాజ ఇంధనాల వాడకం వల్ల ఏర్పడే కాలుష్యం కారణంగా.. లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారని ఆ నివేదిక వెల్లడించింది. శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించడంతో పాటు ఆరోగ్య కార్యక్రమాలపై మరింత దృష్టి పెట్టాలని ప్రపంచ దేశాలకు సూచించారు. శిలాజ ఇంధనాల పెరుగుదలతో ఆహార భద్రత, అంటు వ్యాధుల వ్యాప్తి, అధిక ఉష్ణోగ్రతలు, విద్యుత్ సంక్షోభం, గాలి కాలుష్యం వంటివి పెరుగుతాయని హెచ్చరించింది. మరణాల రేటు కూడా గణనీయంగా పెరుగుతుందని నిపుణులు హెచ్చరించారు. శిలాజ ఇంధనాలకు రాయితీలు ఇవ్వడం తగ్గించాలని సూచించారు. వీలైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని, లేకపోతే వినాశనం తప్పదని చెప్పారు. మరోవైపు ఢిల్లీలో ఎయిర్ పొల్యూషన్ మరోసారి పెరిగింది. పూర్ కేటగిరి నుంచి వెరీ పూర్ కేటగిరికి చేరింది. దీంతో గాలిలో నాణ్యత తగ్గింది. దీపావళి తరువాత నుంచి ఎయిర్ క్వాలిటి తగ్గుతందని అధికారులు చెబుతున్నారు. పొల్యూషన్ కారకాలు వాతావరణంలో పెరిగి పోయాయని వాతావరణ శాఖ అధికారులు అన్నారు. దేశరాజధాని ఢిల్లీలో వరుసగా ఆరు రోజుల తర్వాత మంగళవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ కాస్త మెరుగుపడింది. అయినప్పటికీ ప్రమాదకర స్థాయిలోనే కొనసాగుతోంది. కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. మంగళవారం ఉదయం 9 గంటలకు దేశరాజధాని ఢిల్లీలో ఏక్యూఐ 272గా నమోదైంది. అత్యధికంగా ముండకా ప్రాంతంలో ఏక్యూఐ 327 తో అధ్వాన స్థితికి చేరినట్లు తెలిపింది. ఇక ఆనంద్ విహార్‌లో 318, అయా నగర్‌లో 313, వజీర్‌పూర్‌లో 307, పట్‌పర్ గంజ్‌లో 296, ఆర్కేపురంలో 295, రోహిణి ప్రాంతంలో 287, ఓఖ్లాఫేజ్ ? 2 లో 265, ఐటీవో ప్రాంతంలో 261, లోధీ రోడ్డులో 255, ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ ప్రాంతంలో 247, అరబిందో మార్గ్‌లో 240గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైనట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. ఈ మధ్య ఢిల్లీలో వాయు కాలుష్యం ఆందోళనకరంగా మారుతున్న విషయం తెలిసిందే. గత వారం రోజుల నుంచిదేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. దీపావళి పండుగకు ముందే వాయు నాణ్యత దారుణంగా పడిపోయింది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికి తోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహించింది. దీంతో నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధ్వానస్థితికి చేరినట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.

## వారం రోజుల్లో కెటిఆర్ క్షమాపణలు చెప్పాలి

హైదరాబాద్,కటీఆర్ లీగల్ నోటీసులకు కేంద్రమంత్రి బండి సంజయ్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. నోటీసుల్లో కేటీఆర్ ఆరోపణలు అవాస్తవమని అన్నారు. కేటీఆర్ పేరును తాను ఎక్కడా ప్రస్తావించలేదన్నారు.కేటీఆర్ తన లీగల్ నోటీసులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగతంగా ఎవరిపైన విమర్శలు చేయడం తన ఉద్దేశం కాదన్నారు.. రాజకీయాల్లో ఒకరినొకరు విమర్శలు చేసుకోవడం సహజమన్నారు. ఏడు రోజుల్లో కేటీఆర్ తన ఆరోపణలకు క్షమాపణలు చెప్పాలని లేకపోతే.. తాను చట్టపరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు. కేటీఆర్ నోటీసులకు బదులిచ్చా..తిరిగి తాను కూడా నోటీసులిస్తానని బండి సంజయ్ చెప్పారు. బూతులు తిట్టే వాళ్లు నోటీసులివ్వడమేంటని బండి సంజయ్ ప్రశ్నించారు. కేటీఆర్ బావ మరిది మందు దందాలో దొరికితే బీఆర్ఎస్ నేతలు ధర్నా చేయడమేంటని ప్రశ్నించారు. కేసీఆర్ లేకపోతే కేటీఆర్ ను ఎవరూ పట్టించుకోరన్నారు. బీజేపీ మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదు.

# విజయమ్మ సంచలన లేఖ!

అమరావతి,గత కొన్ని రోజులుగా ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, షర్మిల మధ్య జరుగుతున్న ఆస్తుల వివాదం ఇప్పుడు అత్యంత హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో వైఎస్ విజయమ్మ ఎంట్రీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఓ లేఖ రాశారు. ఇందులో పలు కీలక విషయాలు వెల్లడించారు.అవును... జగన్ – షర్మిల మధ్య నెలకొన్న ఆస్తుల వ్యవహారం తీవ్రమవుతున్న నేపథ్యంలో.. నాలుగు గోడల మధ్య వ్యవహారం బజారుకు వచ్చిందనే కామెంట్లు వినిపిస్తున్న తరుణంలో... వైఎస్ విజయమ్మ ఎంట్రీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె లేఖలో పేర్కొన్న విషయాలను ఇప్పుడు చూద్దామ్.!ఇందులో భాగంగా... "రాజశేఖర్ రెడ్డి గారు ప్రేమించే ప్రతీ హృదయానికీ, ఈ కుటుంబాన్ని ఆదరించి అక్కున చేర్చుకున్న ప్రతీ ఒక్కరికీ మీ విజయమ్మ చేస్తున్న అభ్యర్థన" అని మొదలైన ఈ లేఖలో... ఇప్పుడు జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే మనసుకు చాలా బాధేతుందని.. తన కుటుంబానికి ఏ దిష్టి తగిలిందో అర్థం కావడం లేదని అన్నారు.నేను అడ్డుకోవడానికి ఎంత ప్రయత్నించినా.. జరగకూడనివి అన్నీ నా కళ్లముందే జరిగిపోతున్నాయి. ఈ కుటుంబం గురించి ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళు మాట్లాడుతున్నారు. అబంద్దాల పరంపర కొనసాగుతుంది. తెలిసి కొంత, తెలియకుండా కొంత మాట్లాడుతున్నారు.ఇవి కొనసాగకూడదు. నా పిల్లలిద్ధరికీ కాదు.. చెప్పాలంటే ఇది రాష్ట్రానికి కూడా మంచిది కాదు. నేను మీ ముందుకు ఈ విషయంగా రాకూడదని అనుకున్నాను.. అయినా రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కుటుంబం గురించి మాట్లాడుతున్నవారందరికీ ఒకటే అడుగుతున్నాను!రాజశేఖర్ రెడ్డి గారు మన మధ్యనుంచి వెళ్లిపోయాక నా పిల్లలను, ఆయన ఉన్నప్పటి కంటే ఎక్కువగా ప్రేమించి, ఆదరించి అక్కున చేర్చుకున్నారు. ఇది నేను ఎన్నటికీ మరిచిపోలేను. అందుకు నా జన్మంతా మీకు రుణపడి ఉంటూ హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.నా పిల్లల గురించి తక్కువ చేసి మాట్లాడొద్దు.. ముఖ్యంగా సోషల్ మీడియాలో కల్పిత కథలు రాయవద్దు.. దూషణలు చేయవద్దు.. ఈ కుటుంబం మీద ప్రేమ ఉంటే ఇంతకంటే ఎక్కువ మాట్లాడొద్దు.. "బ్లడ్ ఈజ్ థిక్కర్ దేన్ వాటర్". వాళ్లు ఇద్దరూ సమాధాన పడతారు.ఈ సమయంలో మీరెవరూ రెచ్చగొట్టొద్దని నా మనవి. నేను నమ్మిన దేవుడు యేసయ్య.. సమాధాన కర్త. నా బిడ్డ సమస్యలకు పరిష్కారం ఇస్తాడని నా నమ్మకం.ఇటీవల వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి, ఇతరులు అందరూ.. వాళ్లు మాట్లాడుతున్నది వాళ్లు ప్రేమించే వైఎస్సార్ గురించి అని మరిచి, తీస్తున్నది ఆయన కుటుంబ పరువు అని స్పృహ లేకుండా, ఎన్నో అసత్యాలు చెప్పారు.వైఎస్సార్ గారు బ్రతికి ఉండగానే ఆస్తులు పంచేశరు అని అన్నారు. ఇది అవాస్తవం. వైఎస్సార్ గారు పిల్లలు ఇద్దరూ పెరుగుతున్న రోజుల నుంచీ కొన్ని ఆస్తులు పాప పేరు మీద, అలాగే కొన్ని ఆస్తులు జగన్ పేరు మీద పెట్టారు.. ఇది ముమ్మాటికీ ఆస్తులు పంచడం కాదు.విజయసాయిరెడ్డి గారు ఆడిటర్ గా ఉన్నారు కాబట్టి ఆయనకు అన్నీ తెలుసు. వైవీ సుబ్బారెడ్డి



గారు ఈ ఇంటి బంధువుగా ఎంవోయూపై సాక్షి సంతకం చేశారు. అయినా.. మీడియాలో అవాస్తవాలు మాట్లాడటం నాకు చాలా బాధ కలిగించింది.వీరు ఇద్దరూ నా పిల్లలు. వీరిని నేను, వైఎస్సార్ గారు ఎంతో అపురూపంగా ప్రేమగా పెంచుకున్నాం. అమ్మగా నాకు ఇద్దరూ సమానమే. అలాగే రాజశేఖర్ రెడ్డి గారి మాటా సమానమే. ఆస్తులు కూడా ఇద్దరికీ సమానమే అన్నది నిజం.నలుగురు చిన్నబిడ్డలకు సమానంగా ఉండాలన్న వైఎస్సార్ గారి ఆజ్ఞ నిజం. ఆస్తులు వృద్ధిలోకి తేవడంలో జగన్ కష్టం ఉందనేది నిజం. కానీ.. అన్ని ఆస్తులు కుటుంబ ఆస్తులే అన్నది నిజం. బాధ్యతగల కొడుకుగా కుటుంబ ఆస్తులను జగన్ సంరక్షించాలి అన్నది కూడా నిజం.రాజశేఖర్ రెడ్డి గారు మన మధ్య నుంచి వెళ్లిపోయిన తర్వాత.. 2009 నుంచి 2019 వరకూ 10 ఏళ్లు కలిసే ఉన్నారు. డివిడెండ్ రూపంలో జగన్ వాటా తీసుకొని, 200 కోట్లు పాప భాగానికి ఇచ్చారు. ఎంవోయూ ప్రకారం జగన్ 60 శాతం, పాపకు 40 శాతం.2019లో సీఎం అయిన తర్వాత... డివైడ్ అవ్వాలని ఇజ్రాయెల్ లో జగన్ ప్రపోజల్ పెట్టారు. పిల్లలు పెద్దవాళ్లు అయ్యారు.. నాకు అల్లుళ్లు వస్తారు.. నీకు అల్లుడు, కోడలు వస్తారు.. మనం కలిసి ఉన్నట్లు వాళ్లు కలిసి ఉండకపోవచ్చు కాబట్టి విడిపోదాం అన్నాడు.ఆ తర్వాత విజయవాడలో నా సమక్షంలో ఆస్తులు ఇవి జగన్ కి, ఇవి పాపకు అని అనుకున్నారు. 2019లో అప్పుడు రాసిన ఎంవోయూనే ఈ ఎంవోయు. హక్కు ఉంది కాబట్టే పాపకి 200 కోట్లు ఇచ్చారు. అవి పాపకు జగన్ గిఫ్ట్ గా ఇస్తున్నవి కాదు.. బాధ్యతగా ఇస్తున్నవి.షర్మిలమ్మను బిజినెస్ లో ఇన్వాల్వ్ చేయలేదు. అయినా షర్మిలమ్మ పాలిటిక్స్ లో జగన్ చెప్పినట్లు చేసింది. జగన్ కోసం నిస్వార్థంగా కష్టపడింది. జగన్ అధికారంలోకి రావడానికి పాప ఎంతో కృషి చేసింది.జన్మనిచ్చిన ప్రతీ తల్లితండ్రులకు బిడ్డలు అందరూ సమానమే. ఒక బిడ్డ ఇంకో బిడ్డకు అన్యాయం చేస్తుంటే చూసి తట్టుకోవడం చాలా కష్టం. తల్లిగా, అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన్న ఉండి మాట్లాడటం నా విధి, నా ధర్మం.ఇంతమంది పెద్ద మనుషులు చెప్తున్న అబద్ధాల మధ్య నిజం తెలియాలనే ఇన్ని విషయాలు చెప్పల్సి వచ్చింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com